

ANGRAU

ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

# వ్యవసాయం

వ్యవసాయ సచిత్ర మాస పత్రిక


సంపుటి - 14 | సంచిక - 07 | జులై 2022 | పేజీలు - 44 | వెల రూ. 20/-






## 52 మరియు 53వ వార్షిక స్నాతకోత్సవం



మెట్ట సాగులో నేల మరియు నీటి సంరక్షణ



నేరుగా వరి విత్తే పద్ధతిలో మెళకువలు



కర్రపెండలంలో రకాలు & నారుమడి యాజమాన్యం

# ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయములో జరిగిన

# వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక




ఆంగ్రూ మరియు జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ అవగాహన ఒప్పంద కార్యక్రమం @ ఆర్.ఎ.ఆర్.ఎస్., లాం.



ఆంగ్రూ మరియు సహస్ర క్రాప్ సైన్స్ ప్రైవేటు లిమిటెడ్ అవగాహన ఒప్పంద కార్యక్రమం @ పరిపాలనా భవనం, లాం.




రాష్ట్రస్థాయి విస్తరణ కార్యక్రమాల సమీక్షా సమావేశం @ ఆర్.ఎ.ఆర్.ఎస్., లాం, గుంటూరు.



ఏరువాక పౌర్ణమి @ ఆర్.ఎ.ఆర్.ఎస్., లాం.



వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురంకు ఉత్తమ మెట్ట వ్యవసాయ పరిశోధనా స్థాన పురస్కారం @ క్రీడా, హైదరాబాద్

ANGRAU

# వ్యవసాయం

శ్రీ శుభకృత్ నామ సం॥
ఆషాఢ మాస శు.విదియ ము॥
శ్రావణ మాస తదియ వరకు

## సంపాదక వర్గం

ప్రధాన సంపాదకులు
**డా॥ ఎ. లలిత**
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి (ఎఫ్.ఎ.సి.)

సంపాదకులు
**డా॥ యం. వెంకటరాములు**
సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ)

వ్యవసాయం మాస పత్రిక
సంవత్సర చందా రూ. 200/- లేదా
జీవితకాల (10 సంవత్సరములు) చందా
రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి.
రూపంలో చెల్లించవచ్చు.
మని ఆర్డర్ లేదా డి.డి అయితే PRINCIPAL AGRICULTURAL INFORMATION OFFICER, GUNTUR, ANDHRA PRADESH పేరిట తీసి గుంటూరులో చెల్లేవిధంగా పంపించాలి.

చిరునామా :
ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము
అడ్వాన్స్‌డ్ పోస్టు గ్రాడ్యుయేషన్ సెంటర్ ఆవరణ,
లాం, గుంటూరు - 522 034, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 91005 00223
ఈ-మెయిల్ : paio@angrau.ac.in

## విషయ సూచిక

1. ఉపకులపతి సందేశం ................................ 5
2. విస్తరణ సంచాలకుల సందేశం ........................ 6
3. వివిధ పంటలలో ఈ మాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు .................................... 7
4. సాంకేతిక వ్యాసాలు
- ప్రస్తుత ఖరీఫ్ 2022-23 లో ప్రధాన పంటల అంచనా ధరలు ..................................... 18
- నేరుగా వరి విత్తి సాగు చేయు పద్ధతిలో మెళకువలు. 20
- వివిధ పంటలలో జీవ శిలీంద్రాల వాడకం ద్వారా నేల ద్వారా సంక్రమించే తెగుళ్ళ సమర్ధ నివారణ - రైతుల అభిప్రాయాలు ................................ 25
- మెట్టసాగులో పాటించవలసిన నేల మరియు నీటి సంరక్షణా పద్ధతులు ................................ 27
- కర్రపెండలంలో మేలైన రకాలు మరియు నారుమడి యాజమాన్యం ..................................... 31
- మామిడి తోటలలో కోత అనంతర సాగు యాజమాన్య పద్ధతులు .............................. 33
- వర్షాకాలంలో - కోళ్ళ యాజమాన్యం ............... 35
- వ్యవసాయ విద్య విస్తృత వ్యాప్తికి సార్వత్రిక మరియు దూర విద్యా కేంద్రం కోర్సులు ...................... 37
5. విశ్వవిద్యాలయ వార్తలు.............................. 39
6. రైతుల సమస్యలు - శాస్త్రవేత్తల సలహాలు........... 40
7. కర్షక విజయాలు
- మిరపలో అధిక ఆదాయం పొందిన శ్రీ. జి.పి. నాగిరెడ్డి విజయగాథ.................................. 41

పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను
తమ అమూల్యమైన సలహాలను, సూచనలను అందచేయవలసిందిగా కోరుచున్నాము.

# జులై మాసం క్యాలెండర్ - 2022

| SUN ఆది | MON సోమ | TUE మంగళ | WED బుధ | THU గురు | FRI శుక్ర | SAT శని |
|---|---|---|---|---|---|---|
| **31** తదియ రా. 2-06 మఘ ప. 1-34 రా.వ. 10-01 ల 11-42 | * | * | * | * | **1** శు. విదియ ఉ. 10-40 పుష్యమి రా. 2-08 ఉ.వ. 8-32 ల 10-18 | **2** తదియ ప. 12-22 ఆశ్రేష తె. 4-16 సా.వ. 4-05 ల 5-49 |
| **3** చవితి ప. 1-41 మఘ పూర్తి సా.వ. 5-11 ల 6-54 | **4** పంచమి ప. 2-34 మఘ ఉ. 6-07 ప.వ. 2-30 ల 4-11 | **5** షష్ఠి ప. 2-57 పుబ్బ ఉ. 7-20 ప.వ. 2-45 ల 4-24 | **6** సప్తమి ప. 2-49 ఉత్తర ఉ. 8-05 సా.వ. 4-34 ల 6-11 | **7** అష్టమి ప. 2-14 హస్త ఉ. 8-20 సా.వ. 4-15 ల 5-50 | **8** నవమి ప. 1-11 చిత్ర ఉ. 8-08 ప.వ. 1-35 ల 3-08 | **9** దశమి ఉ. 11-43 స్వాతి ఉ. 7-30 ప.వ. 12-52 ల 2-24 |
| **10** ఏకాదశి ఉ. 9-54 విశాఖ ఉ. 6-31, అనూరాధ తె. 5-11 ఉ.వ. 10-19 ల 11-50 | **11** ద్వాదశి ఉ. 7-50, త్రయోదశి తె. 5-29 జ్యేష్ఠ తె. 3-44 ఉ.వ. 10-26 ల 11-56 | **12** చతుర్దశి తె. 3-05 మూల రా. 2-08 ఉ.వ. 11-12 ల 12-42, రా.వ. 12-38 ల 2-08 | **○13** పూర్ణిమ రా. 12-36 పూర్వాషాఢ రా. 12-29 ప.వ. 11-04 ల 12-33 | **14** బ.పాడ్యమి రా. 10-10 ఉత్తరాషాఢ రా. 10-51 ఉ.వ. 7-56 ల 9-25, రా.వ. 2-35 ల 4-05 | **15** విదియ రా. 7-50 శ్రవణం రా. 9-20 రా.వ. 1-06 ల 2-37 | **16** తదియ సా. 5-43 ధనిష్ఠ రా. 8-01 రా.వ. 2-54 ల 4-26 |
| **17** చవితి ప. 3-50 శతభిషం సా. 6-58 రా.వ. 1-11 ల 2-44 | **18** పంచమి ప. 2-17 పూర్వాభాద్ర సా. 6-16 తె.వ. 3-44 ల 5-19 | **19** షష్ఠి ప. 1-08 ఉత్తరాభాద్ర సా. 5-58 వర్జ్యము లేదు | **20** సప్తమి ప. 12-25 రేవతి సా. 6-07 ఉ.వ. 6-02 ల 7-39 | **21** అష్టమి ప. 12-12 అశ్విని సా. 6-45 ప.వ. 2-38 ల 4-16, తె.వ. 4-46 ల | **22** నవమి ప. 12-32 భరణి రా. 7-53 ఉ.శే.వ. 6-27 వ | **23** దశమి ప. 1-20 కృత్తిక రా. 9-30 ఉ.వ. 8-42 ల 10-24 |
| **24** ఏకాదశి ప. 2-36 రోహిణి రా. 11-32 ప.వ. 2-51 ల 4-35, తె.వ. 5-41 ల | **25** ద్వాదశి సా. 4-14 మృగశిర రా. 1-53 ఉ.శే.వ. 7-26 వ | **26** త్రయోదశి సా. 6-08 ఆర్ద్ర తె. 4-27 ఉ.వ. 11-11 ల 12-57 | **27** చతుర్దశి రా. 8-08 పునర్వసు పూర్తి సా.వ. 5-45 ల 7-31 | **•28** అమావాస్య రా. 10-04 పునర్వసు ఉ. 7-04 ప.వ. 3-53 ల 5-39 | **29** శు.పాడ్యమి రా. 11-47 పుష్యమి ఉ. 9-33 రా.వ. 11-30 ల 1-15 | **30** విదియ రా. 1-10 ఆశ్రేష ఉ. 11-45 రా.వ. 12-39 ల 2-23 |

## పునర్వసు కార్తె (04.07.2022 నుండి 19.07.2022)

| | | |
|---|---|---|
| వరి | : | సార్వా వరినాట్లు, ముందుగా నాటిన వరిలో అంతరకృషి, సస్యరక్షణ |
| సజ్జ | : | రసాయనిక ఎరువులు వేసి పునాస లేక ఖరీఫ్‌పైరు విత్తుట |
| వేరుశనగ | : | అంతరకృషి, సస్యరక్షణ |
| ఆముదం | : | రసాయనిక ఎరువులు వేసి విత్తుట |
| జొన్న | : | పునాస లేక ఖరీఫ్ జొన్న విత్తుట. విత్తిన పంటకు ఎరువులు వేయుట. సస్యరక్షణ |
| మొక్కజొన్న | : | అంతరకృషి, సస్యరక్షణ, రెండవ దఫా ఎరువులు వేయుట |
| ప్రత్తి | : | వర్షాధారపు పంట విత్తడం. ముందుగా నాటిన ప్రత్తిలో అంతర కృషి. ఎరువులు వేయుట |
| కొర్ర | : | ఎరువులు వేయుట, దుక్కి తయారు చేయుట |
| వేరుశనగ | : | అంతరకృషి, సస్యరక్షణ |
| ఆముదం | : | కలుపు తీయుట, సస్యరక్షణ |
| చెఱకు | : | జడచుట్లు వేయుట |
| రాగి | : | నారు నాటడం, ఎరువులు వేయుట, అంతరకృషి, సస్యరక్షణ |

## పుష్యమి కార్తె (20.07.2022 నుండి 02.08.2022)

| | | |
|---|---|---|
| వరి | : | సస్యరక్షణ, రసాయనిక ఎరువులు వేయుట |
| జొన్న | : | అంతర కృషి, మొక్కలు పలుచన చేయుట, సస్యరక్షణ |
| మొక్క జొన్న | : | అంతర కృషి, సస్యరక్షణ |
| కొర్ర | : | విత్తనం వేయుట |
| వనమహోత్సవం | : | చెట్ల నాట్లకు తయారీ, పొలాల గట్లపై చెట్ల నాట్లకు తయారి. |
| సజ్జ / రాగి | : | సస్యరక్షణ, అంతరకృషి |

# నేల, నీటిని సంరక్షించు...
# పసిడి పంటలను పండించు.....



**డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి**
ఉపకులపతి
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

నేల మరియు నీరు వ్యవసాయానికి కీలకం. అయితే ప్రకృతి వైపరీత్యాలు వీటిపై ప్రభావం చూపిస్తున్నాయి. అందులో ముఖ్యమైనవి వర్షాభావం ఒకటైతే, అకాల వర్షాలు మరొకటి. మారిన మానవ జీవన విధానాలు, పారిశ్రామీకరణ ఫలితంగా భూమి క్రమంగా వేడెక్కి ఇలాంటి పరిస్థితులకు దారి తీస్తుంది. ముఖ్యంగా తక్కువ సమయంలో కుంభవృష్టి వల్ల అధిక వర్షం పడ్డప్పుడు మరియు తుఫానులు వచ్చినపుడు నీరు వరద రూపంలో నష్టపోవడం జరుగుతుంది. అంతేకాకుండా ఈ వరద వల్ల నేలపై పొరలలోని సారవంతమైన పోషకాలు నీటితో పాటు కొట్టుకుపోయి నేల నిస్సారమవుతుంది. మరోవైపు ఋతుపవనాల తిరోగమనం తొందరగా అవటం, పంట మధ్య లేక చివరి దశలలో వర్షాలు సరిగా రాకపోవటం, తక్కువ వర్షపాతం నమోదవటం జరుగుచున్నది. ఇందువలన సారవంతమైన నేలపై పొరలలోని మట్టిని మరియు నీటిని సంరక్షించటానికి నేల మరియు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి.

పంటల ఉత్పాదకతను ప్రభావితం చేసే అంశాలలో సారవంతమైన నేల, సాగు నీటి లభ్యత ముఖ్యమైనవి. వర్షాకాలంలో లేదా నీటి లభ్యత ఎక్కువగా ఉన్న సమయంలో, నీటి కుంటలు లేదా చెరువులలో నీరు నిల్వ ఉంచి, తద్వార పంటలకు కావలసిన సమయంలో అవసరం మేరకు వాడుకొని, పంటలను పండించి, రైతులు మంచి దిగుబడులు సాధించవచ్చు.

అంతేకాకుండా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా సాగునీటి ప్రాజెక్టులు, వాటర్‌షెడ్‌లను నిర్మించడం, చెక్‌డామ్‌ల కట్టడాలు, సాగునీటి రైతు సంఘాలను ఏర్పరచడం, సూక్ష్మసేద్యం వంటి నేల మరియు నీటి సంరక్షణ పథకాలను కూడా చేపట్టారు. ప్రభుత్వం అందించే సహకారంతో పాటు, వ్యవసాయ విశ్వవిద్యాలయం అందించే నేల మరియు నీటి సంరక్షణకు సంబంధించిన నూతన సాంకేతిక పద్ధతులను వినియోగించుకొని రాష్ట్ర వ్యవసాయాభివృద్ధిలో రైతాంగం తమ వంతు పాత్ర పోషించాలి.

ఈ దిశగా లోతు దుక్కులు దున్నటం, వాలుకి అడ్డంగా విత్తుకోవడం, నాగటి సాళ్ళు వేసుకోవడం, నీటికుంటల ఏర్పాటు, జీవగట్లను ఏర్పాటు చేసుకోవడం, అంతరసేద్యం, సూక్ష్మసేద్యం, వాలు నేలల్లో రాతి కట్టడాలను నిర్మించడం, మల్చింగ్ వంటి పరిజ్ఞానాన్ని రైతులు ఉపయోగించుకొని, పసిడి పంటలను పండించడంతో పాటు సుస్థిర వ్యవసాయం దిశగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను.



(ఏ. విష్ణువర్ధన రెడ్డి)

# జల సంరక్షణ - సుస్థిర సేద్యానికి నాంది



**డా॥ పి. రాంబాబు**
విస్తరణ సంచాలకులు
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 58.2 శాతం భూమి వర్షాధారంగా సాగులో ఉంది. ముఖ్యంగా మెట్ట వ్యవసాయంలో సాగు నీటి లభ్యత కేవలం వర్షపాతం పై ఆధారపడి ఉన్నది. మన రాష్ట్రంలో కురిసే వర్షపాతంలో దాదాపు 40 శాతం వరకు వర్షపు నీరు భూమి లోనికి ఇంకి పోవడం, ఒరవడి రూపంలో పొలం బయటకు వృధాగా పోతుంది. కేవలం 10 శాతం వరకు మాత్రమే భూమిలో పట్టి ఉంచబడి, పంటలు సద్వినియోగ పరుచుకోవడం జరుగుతుంది. ఈ వర్షపు నీరు పొలం బయటికి కొట్టుకోనిపోవడం వలన వర్షపు నీటి వృధాతో పాటు సారవంతమైన భూమి పై ఉన్న పొర కొట్టుకొని పోవడం వలన పోషకాల నష్టంతో పాటు నేల మృత్తికా క్రమక్షయం జరుగుతుంది. కావున, కొద్ది సంవత్సరాలలోనే భూమిలో ఉత్పాదకత శక్తి తగ్గి, పంట దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగ పరుచుకొని, భూమి కోతకు గురి కాకుండా పంట దిగుబడులు పెంచుకోవాలి.

రైతులకు వివిధ కార్యక్రమాల ద్వారా సాగుకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నీటి యాజమాన్య ప్రణాళిక కూడ తప్పనిసరి. మన వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రాలు మరియు ఏరువాక కేంద్రాలు ద్వారా జలశక్తి అభియాన్ వంటి కార్యక్రమాలతో పాటు వర్షపు నీటి యాజమాన్య పద్ధతులైనటు వంటి లోతు దుక్కులు, వాలుకు అడ్డంగా సేద్యం, కాంటూరు సేద్యం, నీటి సంరక్షణ సాళ్ళు, బోదెలు - కాలువల పద్ధతి పాటించడం, నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడం వంటి చర్యలతో పాటు నేలలో తేమను నిలిపి వేసే సేంద్రీయ పదార్థాలను పెంపొందించే దిశలో రైతులను ప్రోత్సహిస్తున్నాము. వీటితో పాటు తక్కువ భూసారం మరియు తక్కువ నీటి వసతి కలిగిన ప్రాంతాలలో జొన్న, సజ్జ, రాగి, కొర్ర, సామలు మొదలైన చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాము.

వర్షాధార ప్రాంతాలలో పడిన వర్షం అంతా సత్వర వినియోగం జరగదు. అందువల్ల పడిన అధిక వర్షాన్ని పంట పొలంలో పల్లపు ప్రాంతంలో ఏర్పరచుకున్న నీటికుంటలలో సేకరించుకొని, నిల్వ చేయబడిన నీటిని పంట సున్నిత దశలలో జీవ రక్షక తడులుగా ఇచ్చి ఉత్పాదకతలో గణనీయమైన వృద్ధి సాధించవచ్చును. కావున, రైతులు వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ కేంద్రాలను సంప్రదించి, ఆచరించతగిన మేలైన సాగు పద్ధతులను ఎప్పటికప్పుడు తెలుసుకొని పంటల సాగును చేపట్టి సుస్థిర దిగుబడులు సాధిస్తారని ఆశిస్తున్నాను.

(పి. రాంబాబు)




**జూన్ నెలలో వరి నారుమడులు పోసిన రైతుల పొలాల్లో జులైలో నాట్లు పడే అవకాశం ఉన్నందువలన వరి నాట్లు సమయంలో ఈ క్రింది మెళకువలు పాటించాలి :**

- ప్రధాన పొలమును 3-4 సార్లు దమ్ము చేసి బాగా చదును చేసుకోవాలి.
- ఆయా మండలాలకు సిఫారసు చేసిన భాస్వరం ఎరువును ఆఖరి దమ్ములో వేసుకోవాలి.
- దీర్ఘ కాలిక మరియు మధ్య కాలిక రకాలకు 25-30 రోజులు వయసున్న నారును ఊడ్చుకోవాలి.
- స్వల్పకాలిక రకాలు సాగు చేస్తున్నపుడు 20-25 రోజులు వయసున్న నారును ఊడ్చుకోవాలి.
- రెండు నుండి మూడు మునల నారును పై పై న ఊడ్చాలి (నాటుకోవాలి).
- కాలి బాటలు 2-3 మీటర్ల విధిగా ఉండేటట్లు చూసుకోవాలి.
- సిఫారసు చేసిన నత్రజనిని మూడు సమ భాగాలుగా మొదటి సారి నాటటానికి ముందు, రెండవ సారి పిలకల దశలో మరియు ఆఖరుగా అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి. పొటాష్‌లో సగ భాగాన్ని మొదటి దఫాలో మరియు మిగతా సగాన్ని అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి.
- ప్రధాన పొలంలో కలుపు నివారణకు, నాట్లు వేసిన 3-5 రోజులలోపు పల్చగా నీరు పెట్టి ఎకరానికి 1.5 లీటర్ల బుటాక్లోర్ లేదా 500 మి.లీ. ప్రిటిలాక్లోర్ లేదా ఆక్సాడయార్జిల్ 35-50 గ్రా. లేదా బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ + ప్రిటిలాక్లోర్ గుళికలు 4 కిలోలు చొప్పున సమానంగా పడే లాగా ఎకరానికి 20-25 కిలోల ఇసుకతో కలిపి చల్లుకోవాలి.

**జూన్ లో నారు పోయకుండా పచ్చి రొట్ట వేసుకున్న రైతులకు సూచనలు :**

- జూన్‌లో జీలుగ వంటి పచ్చి రొట్ట ఎరువులు చల్లిన రైతులు 30 - 40 రోజుల వయసు గల పచ్చి రొట్ట మొక్కలను కాడ పలుచగా ఉన్నప్పుడు కలియ దున్నటం వలన చేసుకు అవసరమైన 1/3 వంతు ఎరువు అంది భూసారం పెరుగుతుంది.

**వరి నారుమళ్ళు వేసుకునే సమయాన్ని బట్టి రకాల ఎంపికలో పాటించవలసిన మెళకువలు :**

- జులై 15 వ తారీకు వరకు ఆయా మండలాలకు సిఫారసు చేసిన వరి రకాలు వేసుకోవచ్చు.
- జులై 15 నుండి జులై 30 లోపు నారు పోసుకునే రైతులు ఆయా మండలాలకు సిఫారసు చేసిన మధ్యస్థ కాల పరిమితి గల రకాలు వేసుకోవాలి.
- ఆగష్టు వరకు నారు మడులు వేయకపోతే, స్వల్పకాలిక రకాలైన ఎన్.ఎల్.ఆర్. 34449, యం.టి.యు. 1153, యం.టి.యు. 1156, యం.టి.యు. 1010 మరియు ఐ.ఆర్. 64 వంటి రకాలను సాగు చేసుకోవచ్చు.

**ఎద పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు తీసుకోవలిసిన మెళకువలు :**

- ఉత్తర కోస్తాలో మరియు కృష్ణా డెల్టాలో ఎద పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు పడి పోని రకాలను ఎంపిక చేసుకోవాలి.
- జులై లోపు మధ్య కాలిక రకాలు మరియు ఆగష్టులో అయితే స్వల్ప కాలిక రకాలు విత్తుకోవాలి.
- సిఫార్సు చేసిన ఎరువులలో భాస్వరం పూర్తిగా, సగ భాగం పొటాష్ ఎరువుకు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. నత్రజనిని మొదటి దఫా విత్తిన 15 రోజులకు, రెండవ సారి పిలకల దశలో మరియు ఆఖరి సారి అంకురం ఏర్పడే దశలో పొటాష్ ఎరువుతో పాటుగా వేసుకోవాలి.
- విత్తిన 3 రోజులకు భూమిలో తేమ ఉండేటట్లు చూసుకొని ఎకరానికి 500 మి.లీ. ప్రిటిలాక్లోర్ + సేఫేనర్ లేదా ఆక్సడయార్జిల్ 35 గ్రాములు 20 లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

**డా॥ టి. శ్రీనివాస్,** ప్రధాన శాస్త్రవేత్త (వరి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
మారుటేరు - 534 122. చరవాణి : 93968 48380





- వేసవిలో లోతు దుక్కులు చేసుకున్న పొలాల్లో వేసవి జల్లులకు పచ్చి రొట్ట పైర్లైన జనుము, జీలుగ, పిల్లి పెసర వంటి విత్తనాలను జల్లుకుని పూత దశ లోపు నేలలో కలియదున్నాలి లేదా పచ్చి ఆకు ఎరువులైన జిల్లేడు, తంగేడు, వేప వంటివి కూడా వేసుకొని నేలలో కలియదున్నవచ్చు. అవకాశాన్ని బట్టి పశువుల ఎరువును వేసుకోవడం లేదా గొర్రెల మందలను కట్టుకోవడం చేయాలి.
- గత నాలుగైదు సంవత్సరాలుగా ప్రత్తిలో గులాబి రంగు పురుగు ఉధృతి అధికంగా ఉండటంతో గత సంవత్సరం సుమారుగా 26 శాతం ప్రత్తి విస్తీర్ణం రాష్ట్ర వ్యాప్తంగా తగ్గింది. కానీ గత సంవత్సరం ప్రత్తికి మంచి గిరాకీ ఉండి మార్కెట్‌లో అధిక ధర పలకటంతో ఈ సంవత్సరం ప్రత్తి విస్తీర్ణం పెరగటానికి అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.
- ఈ నేపధ్యంలో విత్తన ఎంపిక కీలకం. కాబట్టి మార్కెట్‌లో దొరికే బి.టి. సంకర రకాలు తక్కువ కాల పరిమితి గలవి ఎంచుకోవాలి. తద్వారా గులాబి రంగు పురుగును తప్పించుకోవటానికి అవకాశం ఉంది.
- నైఋతి ఋతుపవనాలు వచ్చిన తరువాత 7-10 రోజుల వ్యవధిలో 75-100 మి.మీ. వర్షం పడిన తరువాత పొలంలో విత్తుకోవాలి.
- తేలిక పాటి నేలల్లో ప్రత్తి సిఫారసు చేయటం లేదు. నల్లరేగడి నేలలో వరుసల మధ్య దూరం 90-120 సెం.మీ. మరియు వరుసలలో మొక్కల మధ్య దూరం 45-60 సెం.మీ. ఉండేట్లుగా విత్తుకోవాలి.
- ఒక ప్రాంతంలోని రైతాంగం అంతా దఫదఫాలుగా కాకుండా ఒకేసారి విత్తుకోవాలి. దీని ద్వారా సస్యరక్షణ సులభ మవుతుంది.
- సాధారణంగా మనకు మార్కెట్‌లో దొరికే సంకర రకాలన్నీ కూడా పురుగు మందులతో శుద్ధి చేయబడుతున్నవి. కాకపోతే జీవ శిలీంద్ర నాశినులైన ట్రైకోడెర్మా విరిడె 10 గ్రా. లేదా సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ 10 గ్రా. / కిలో విత్తనానికి విత్తే ముందు పట్టించాలి లేదా కార్బాక్సిన్ 2 గ్రా. / కిలో విత్తనానికి పట్టించడం ద్వారా దాదాపు 40-50 రోజుల వరకూ ప్రత్తి పంటకి వివిధ రకాల తెగుళ్ళ నుండి రక్షణ లభిస్తుంది.
- బి.టి. ప్రత్తికి ఎకరానికి 48-60 కిలోల నత్రజని (3 బస్తాల యూరియా), 24 కిలోల భాస్వరం (3 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) మరియు 24 కిలోల పొటాష్ (40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) పోషకాలను అందించాలి. మొత్తం భాస్వరపు ఎరువును చివరి దుక్కిలో వేసుకోవాలి. నత్రజని మరియు పొటాష్ ఎరువులను 3 దఫాలుగా విత్తిన 20-80 రోజులలో 3-4 దఫాలుగా నేలలో పదునును బట్టి వేసుకోవాలి.
- తేలికపాటి నేలల్లో స్థూల పోషకాల లభ్యతను బట్టి తక్కువగా ఉన్నట్లయితే, 25% అధికంగా అనగా 60-30-30 కిలోల నత్రజని, భాస్వరము మరియు పొటాష్‌ను నేలకు అందించాలి.
- రైతాంగం తప్పనిసరిగా గులాబి రంగు పురుగు కొరకు లింగాకర్షక బుట్టలను సకాలంలో తెచ్చుకొని పొలంలో విత్తిన 40 రోజులకు పంటకు అడుగు ఎత్తులో అమర్చుకోవాలి. నిఘా కొరకైతే 4-6 బుట్టలు ఎకరానికి, నివారణ కొరకైతే 10-15 ఎకరానికి చొప్పున సామూహికంగా అందరూ కలిసి అమర్చుకోవాలి.
- ప్రత్తి విత్తిన వెంటనే లేదా విత్తిన 48 గంటల లోపల పెండిమిథాలిన్ 1.5-2.0 లీ. / ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి నేలంతా తడిచేటట్లు పిచికారి చేయటం వలన విత్తిన 20 రోజుల వరకు కలుపును సమర్ధవంతంగా నివారించవచ్చు.
- విత్తిన 20-30 రోజులప్పుడు గొర్రు మరియు గుంటకలతో అంతరకృషి ద్వారా కలుపు నివారణ చేయాలి.
- తొలి దశలో ఆశించే రసం పీల్చు పురుగులను అదుపు చేయటానికి, విత్తిన 40 నుండి 50 రోజుల దశలో వేప నూనె 1 లీ. / ఎకరానికి లేదా 5% వేప గింజల కషాయాన్ని పిచికారి చేయాలి. అవసరాన్ని బట్టి ఆర్థిక సహన స్థాయిని అనుసరించి పురుగు మందుల పిచికారి చేపట్టాలి. పచ్చ

దోమ, పేను బంక మరియు తామర పురుగుల నివారణకు అసిఫేట్ 75 యస్.పి. 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్.ఎల్.ఎ. 0.4 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 25 డబ్ల్యు.జి.ఎ. 0.2 గ్రా. లేదా ఫిప్రోనిల్ 5 ఎస్.సి.ఎ. 2.0 మి.లీ. లేదా డైఫెన్‌థియురాన్ 50 డబ్ల్యు.పి. 1.25 గ్రా. లేదా ఫ్లోనికామిడ్ 50 డబ్ల్యు.జి.ఎ. 0.3 గ్రా. లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి. తెల్లదోమ నివారణకు 5% వేపగింజల కషాయం లేదా వేపనూనె 5 మి.లీ. లేదా అసిఫేట్ 1.5 గ్రా. లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా డైఫెన్‌థియురాన్ 1.25 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

- ఎకరానికి 10 చొప్పున నీలి రంగు జిగురు అట్టలు తామర పురుగుల కొరకు మరియు పసుపు రంగు జిగురు అట్టలు 10 చొప్పున ఎకరానికి తెల్ల దోమను ఆకర్షించుట కొరకు ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రత్తి పైరు చుట్టూ జొన్న రక్షణగా లేదా మొక్కజొన్న పంటలను 4 వరసలు వేసుకోవడం వల్ల రసం పీల్చే పురుగుల ఉధృతిని కట్టడి చేయవచ్చు.

**డా॥ యం. సుధారాణి,** ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం,
లాం, గుంటూరు - 522 034.
చరవాణి : 99896 25207




తొలకరిలో కంది, మినుము మరియు పెసర పైర్లను సాగు చేసుకునే అవకాశం వుంది.

**మినుము, పెసర :**

**అనువైన రకాలు :**

**మినుము :** జి.బి.జి. 1, టి.బి.జి. 104, ఎల్.బి.జి. 787, ఎల్.బి.జి. 752, పి.యు. 31.

**పెసర :** ఐ.పి.యం. 2-14, డబ్ల్యూ.జి.జి. 42, ఎల్.జి.జి. 460.

- ఆఖరు దుక్కిలో 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం ఎరువులను హెక్టారుకు వేసి కలియ దున్నాలి.
- ఒక కిలో విత్తనానికి 3.0 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ లేదా మాంకోజెబ్ మందుతో విత్తనశుద్ధి చేసి తరువాత 5 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధి చేసి విత్తితే తొలిదశలో ఆశించే రసం పీల్చే పురుగులు మరియు తెగుళ్ళ బారి నుండి కాపాడుకోవచ్చు. చివరగా విత్తేముందు 200 గ్రా. రైజోబియం కల్చరును 10 కిలోల విత్తనానికి పట్టించి విత్తుకోవాలి.

**విత్తు సమయం :** జూన్ 15 నుండి జులై 15 వరకు

**విత్తన మోతాదు : పెసర :** 6-7 కిలోలు/ఎకరాకు;

**మినుము :** 7-8 కిలోలు/ఎకరాకు.

- కలుపు అధికంగా ఉండే భూములలో అయితే విత్తిన వెంటనే పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.0-1.4 లీటర్లు చొప్పున విత్తిన వెంటనే గానీ మరసటి రోజు గానీ పిచికారి చేయాలి. విత్తిన 20-25 రోజులప్పుడు గొర్రుతో అంతరకృషి చేయాలి.
- **సస్యరక్షణ :** మినుము మరియు పెసర పంటలలో తొలిదశలో చిత్త పురుగులు, తామర పురుగులు, తెల్లదోమ, పేనుబంక మరియు కాండపు ఈగ ఎక్కువగా ఆశించడం జరుగుతుంది.

**కాండపు ఈగ :** ఈ పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు :** ఈ పురుగు నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెల్ల దోమ :** ఈ పురుగు నివారణకు ఒక లీటరు నీటికి మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ. లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రా. కలిపి పిచికారి చేయాలి.

**పేనుబంక :** డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**కంది :**

- **అనువైన రకాలు :** ఎల్.ఆర్.జి. 105, టి.ఆర్.జి. 59,

ఎల్.ఆర్.జి. 133-33, ఎల్.ఆర్.జి. 52, ఐ.సి.పి.ఎల్. 85063 (లక్ష్మి), ఐ.సి.పి. 8863 (మారుతి), ఐ.సి.పిఎల్. 87119 (ఆశ).

- ఆఖరు దుక్కిలో హెక్టారుకి 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరము నిచ్చు ఎరువులు వేసి కలియదున్నాలి.
- **విత్తు సమయం : తొలకరికి :** జూన్, జులై మాసాలు అనువైనవి.
- **విత్తన మోతాదు తొలకరికి :** 2-2.5 కిలోలు/ఎకరాకు నేల స్వభావాన్ని బట్టి 120×20 సెం.మీ. నుండి 240×20 సెం.మీ. వరకు.
- కలుపు బెడద ఎక్కువగా వున్నపుడు విత్తిన వెంటనే (24 గంటల లోపు) ఎకరానికి 1.0-1.4 లీటర్ల పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయవలెను.
- **అంతర పంటలు :** తొలకరిలో : కంది+జొన్న/మొక్కజొన్న/సజ్జ (1:2), కంది+పెసర/మినుము/వేరుశనగ/సోయాచిక్కుడు (1:7) నల్లరేగడి నేలలు, (1:4) ఎర్ర నేలలు.
- గత సంవత్సరం వెర్రి తెగులు ఆశించిన పొలంలో మొక్కల అవశేషాలు మరియు చిగుర్లు లేకుండా నాశనం చేయాలి.

**డా॥ యం. వి. రమణ,** ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం. లాం, గుంటూరు.
చరవాణి నెం : 99896 25215

## చెరకు



- ఫిబ్రవరి-మార్చి మాసాల్లో నాటిన మొక్క తోటల్లో చాళ్లలో మట్టిని ఒక అడుగు లోతు వరకు త్వ్వి , దుబ్బుల మొదళ్ళకు మట్టిని ఎగద్రోయాలి.
- డిసెంబరు-జనవరిలో నాటిన చెరకు తోటలకు, కార్శి చేసిన తోటలకు మొవ్వులో 8 పచ్చటి ఆకులు వదిలి జడచుట్లు వేసుకోవాలి.
- వర్షపాతాన్ని అనుసరించి, చెరకు బాగా ఎదిగే దశలో (జూన్ - జూలై) నేల స్వభావాన్ని బట్టి వర్షాభావ పరిస్థితుల్లో తేలిక నేలలకు 10 రోజులకు, బరువైన నేలలకు 15 రోజులకు తడులు ఇవ్వాలి.
- లోతట్టు ప్రాంతాలలో, మురుగు నీటిని చెరకు తోటల నుండి బయటకు తీసి వేసేందుకు 2 అడుగుల లోతులో ఊట కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.
- కొన్ని ప్రాంతాలలో చెరకు పొలం చుట్టూ వరి సాగు ఉంటుంది. అటువంటి పరిస్థితుల్లో వరి పొలంలో నీరు చెరకు తోటల్లోకి రాకుండా చుట్టూ ఉన్న గట్లను బలంగా వేసుకోవాలి.

### వర్షాధారపు చెరకు సాగు :

- వర్షాధారంగా చెరకు సాగు చేసే ప్రాంతాల్లో తొలకరి వర్షాలకు చిజిల్ / సబ్ సాయిలర్‌తో లోతైన సాళ్ళు చేయడం వలన పంట కాలంలో వర్షపు నీరు భూమి లోపలి పొరల్లోకి ఇంకుతుంది. దీని వలన ఎక్కువ తేమ నిలవ వుండి పంట నీటి ఎద్దడికి గురి కాకుండా వుంటుంది.
- ఉత్తర కోస్తా జిల్లాలలో సాగు చేయబడు వర్షాధారపు చెరకు సాగుకు నేలను ఇనుప నాగళ్ళతో లోతు దుక్కిచేసి, ఎకరానికి 10 టన్నులు బాగా మాగిన పశువుల ఎరువు వేసి కలియ దున్నాలి. నేలను బాగా చదును చేసి 60 సెం.మీ. దూరం (ఎడం)తో చాళ్ళు ఏర్పాటు చేసుకోవాలి.
- చెరకు విత్తనాన్ని 10 శాతం సున్నపు నీటిలో ఒక గంట సమయం ముంచి నాటుకోవాలి. దీని కారణంగా మొలక శాతము బాగుంటుంది.
- చెరకు నాట్లకు ముందుగా ఎకరానికి 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేటు మరియు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను చాళ్ళలో వేసుకోవాలి.
- చెరకు నాట్లు జులై 15 లోగా పూర్తి చేసుకోవాలి.
- చెరకు ముచ్చెలు నాటిన మూడు రోజులలోపు ఎకరానికి 2 కిలోల అట్రాజిన్ లేదా 600 గ్రా. మెట్రిబ్యుజిన్ కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పొలమంతా పిచికారి చేసుకోవాలి.
- నాటిన 3 రోజుల లోపుగా కలుపు మందు పిచికారి చేసిన పిదప ఎకరానికి 1.25 టన్నుల చెరకు చెత్తను కప్పుట ద్వారా నేలలోని తేమ సంరక్షింపబడి, కలుపు మరియు పీకపురుగు ఉధృతి తగ్గుతుంది.

- వర్షాధారంగా జూన్‌లో నాటిన చెరకు తోటలకు మొదటి దఫా నత్రజని ఎరువును (ఎకరానికి 30 కిలోల యూరియా) భూమిలో తగినంత పదును వున్నపుడు వేసుకోవాలి.
- పంట తొలిదశలో దీర్ఘకాలిక బెట్టపరిస్థితులు నెలకొన్నపుడు లీటరు నీటికి 25 గ్రాముల యూరియా మరియు 25 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను కలిపి పంటపై పిచికారి చేసుకోవాలి.

**డా॥ టి. చిత్కళా దేవి,** ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు),
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, అనకాపల్లి.
చరవాణి : 99896 25216




- వర్షాధారంగా ధీర్ఘకాలిక మరియు మధ్యకాలిక రకాలను జూలై 15 వరకు మరియు స్వల్పకాలిక రకాలను జూలై ఆఖరి వరకు విత్తుకోవచ్చు.
- ఎకరాకు 8 కిలోల విత్తనం వాడాలి. మొక్కజొన్నలో ఎకరాకు 33,333 మొక్కల సాంద్రత ఉండేలా చూసుకోవాలి. ఇందుకు వరుసల మధ్య 60 సెం.మీ. దూరం (ఎడం) ఉండేటట్లు బోదెలను చేసుకుని మొక్కల మధ్య 20 సెం.మీ. ఉండేటట్లు విత్తనాన్ని బోదెకు ఒక వైపున పై నుండి 1/3 వ వంతు ఎత్తులో విత్తుకుంటే నీటి పారుదలకు సులభంగా ఉండడమేకాక, వర్షపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోవడానికి వీలుంటుంది. వర్షాధారంగా పండించే మొక్కజొన్న పైరులో ఎకరాకు 70-80 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ నిచ్చు ఎరువులు మరియు 20 కిలోల జింక్ సల్ఫేట్ అవసరం. తొలి దఫాగా 1/3 వ వంతు నత్రజని, మొత్తం భాస్వరం, సగం పొటాష్, మొత్తం జింక్ ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి.
- ఎండు తెగులు ఆశించు భూములలో మొక్కజొన్న విత్తేటప్పుడు, ట్రైకోడెర్మా విరిడి జీవ శిలీంద్రనాసిని మందును కిలో విత్తనానికి 10 గ్రా. చొప్పున కలిపి విత్తన శుద్ధి చేయాలి మరియు 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి మందును 100 కిలోల బాగా మాగిన పశువుల ఎరువుతో కలిపి వృద్ధి పరచి దుక్కిలో వేయాలి.
- విత్తిన 1-2 రోజులకు అట్రజిన్ 50% పొడి మందును ఎకరాకు 800-1200 గ్రా. 200 మి.లీ. నీటిలో కలిపి తేమ నేలపై పిచికారి చేయడం వలన వెడల్పాటి ఆకులు గల కలుపు మొక్కలను దాదాపు ఒక నెల వరకు అదుపు చేసుకోవచ్చు. ఒకవేళ పప్పు జాతి పంటలను మొక్కజొన్నతో అంతర పంటలుగా విత్తుకుంటే పెండిమిథాలిన్ కలుపు మందును ఎకరాకు 1.0 లీ. చొప్పున పిచికారి చేయాలి. 20-25 రోజుల దశలోని పంటలో టేంబోట్రీయాన్ కలుపు మందును 1.15 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే కలుపును నియంత్రించవచ్చు.
- జూన్ నెలలో విత్తుకున్న మొక్కజొన్న పైరు మోకాలెత్తు దశలో ఉంటుంది. ఎక్కువ వర్షపాతం నమోదైనప్పుడు లేత పైరు అధిక తేమను తట్టుకోలేదు. ఈ పరిస్థితిని అధిగమించుటకు పొలం నుండి వర్షపు నీరును మురుగు నీటి కాలువల ద్వారా బయటకు తీయాలి.
- 25-30 రోజులు వయసున్న పైరులో అంతర కృషి జరిపి ఎకరాకు ఒక బస్తా యురియాను పైపాటుగా వేసుకుని మట్టిని మొక్కల వేర్లకు ఎగదోయాలి. అవసరమైతే నీరు పెట్టాలి.
- కత్తెర పురుగు మొక్కజొన్న అన్ని దశలలో ఆశిస్తుంది. దీని నివారణకు పంటను సకాలంలో విత్తుకోవాలి, విడతలుగా విత్తకూడదు. సయాంట్రనిలిప్రోల్ 19.8% + థయోమిథాక్సామ్ 19.8% 4.0 మి.లీ. ఒక కిలో విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తనం విత్తిన వారం రోజులకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. ఈ పురుగు మొక్కల ఆకులపై పెద్ద పెద్ద రంధ్రాలు చేయడంతో పాటు, మొక్క సుడిలో పురుగు విసర్జన ఎక్కువగా కనిపిస్తుంది. పంట తొలి దశలో 5% వేప గింజల కషాయం లేదా అజాడిరెక్టిన్ వేప సంబంద మందులు పిచికారి చేయాలి. ఉధృతిని బట్టి ఎమామేక్టిన్ బెంజోయేట్ 5 ఎస్.డి. 0.4 గ్రా. లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 18.5% ఎస్.సి.

0.3 మి.లీ. లేదా స్పైనిటోరం 11.7% ఎస్.సి. 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి సుడులు / మొవ్వు లోపలి ఆకులు పూర్తిగా తడిచేటట్లు పిచికారి చేయాలి. ఈ పురుగు యొక్క ఉనికిని రైతులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, సరైన యాజమాన్య పద్ధతులు సరైన సమయంలో పాటించినట్లయితే పురుగు వల్ల కలిగే అపారమైన నష్టాన్ని నివారించుకోవచ్చు.

**డా॥ ఐ. సుధీర్ కుమార్,**
శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం)
వ్యవసాయ పరిశోధనా స్థానం, పెద్దాపురం.
చరవాణి : 99597 92568




**జొన్న :**

- జొన్న పంట విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి. విత్తిన 20-30 రోజులకు గుంటక లేదా దంతితో అంతరకృషి చేయడం వలన పొలంలో తేమ నిలిచి మొక్కలు బాగా పెరుగుతాయి.
- కలుపు తీసిన తర్వాత ఎకరాకు 20 కిలోల నత్రజనినిచ్చు ఎరువును (నీటి పారుదల క్రింద) లేదా 16 కిలోల నత్రజనినిచ్చు ఎరువును (వర్షాధార పంటకు) పై పాటుగా పైరులో వేయాలి.
- మొవ్వు తొలుచు ఈగ లేదా కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను సాళ్ళలో వేయాలి.

**సజ్జ :**

- సజ్జ పంటను జూలై మాసంలో కూడా విత్తుకోవచ్చు.
- సజ్జ విత్తిన పొలంలో విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి. విత్తిన 20-30 రోజులలోపు గుంటక లేదా దంతితో అంతరకృషి చేయాలి.
- విత్తిన 30 రోజుల తర్వాత ఎకరాకు 16 కిలోల నత్రజని నిచ్చు ఎరువును (నీటి పారుదల పంటకు) 12 కిలోల నత్రజనినిచ్చు ఎరువును (వర్షాధార పంటకు) పై పాటుగా పైరులో వేయాలి.

**రాగి :**

- రాగి పంటను జూలై మాసంలో కూడా విత్తుకోవచ్చు.
- 2.5 కిలోల విత్తనంతో పెంచిన 5 సెంట్ల నారు ఎకరా పొలంలో నాటడానికి సరిపోతుంది.
- నారు పోయడానికి పొలంను మెత్తగా దున్ని చదును చేసుకోవాలి. నారు మడులను తయారు చేసుకొని విత్తనాలను విత్తుకోవాలి.
- 21-25 రోజుల వయస్సు గల నారును నాటుకోవాలి.
- వెదజల్లే పద్ధతిలో భూమిని మెత్తగా తయారు చేసుకొని విత్తనాన్ని సమానంగా చల్లుకోవాలి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి.
- విత్తనం వేసే ముందు లేదా నారు నాటడానికి ముందు పెండిమిథాలిన్ 30% ఎకరాకు 600 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే కలుపు మొక్కలను నివారించుకోవచ్చును.
- ఎకరాకు 12 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం మరియు 8 కిలోల పొటాష్‌ను నాటేటప్పుడు వేయాలి.

**కొర్ర :**

- కొర్ర పంటను జూలై మాసంలో కూడా విత్తుకోవచ్చు.
- కొర్ర పొలంలో విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి.
- విత్తిన 20-30 రోజులలోపు గుంటక / దంతితో అంతరకృషి చేయాలి.
- విత్తిన 3-4 వారాల తర్వాత (కలుపు తీసిన తర్వాత) ఎకరాకు 8 కిలోల నత్రజనినిచ్చు ఎరువును పైపాటుగా వేయాలి.

**డా॥ యం. హేమంత్ కుమార్,**
ప్రధాన శాస్త్రవేత్త (చిరుధాన్యాలు)
వ్యవసాయ పరిశోధనా స్థానము, పెరుమాళ్ళపల్లె.
చరవాణి : 99896 25227




- ఉత్తర కోస్తా ప్రాంతాలలో జూన్ నుండి జూలై చివరి వరకు, రాయలసీమ జిల్లాలలో జూలై నుండి ఆగష్టు మొదటి వారం వరకు వేరుశనగ పంట వర్షాధారంగా విత్తుకోవడానికి అనుకూలము, నీటి ఆదారం క్రింద ఏసమయంలోనైనా విత్తుకోవచ్చు.
- వేరుశనగ విత్తుకోవడానికి ముందుగా మంచి రకం విత్తనాన్ని ఎంపిక చేసుకొని విత్తుకోవాలి.
- **అనువైన రకాలు :** కదిరి మరియు తిరుపతి పరిశోధన స్థానాల నుండి విడుదల చేయబడిన రకాలు మనకు ఖరీఫ్ సాగుకు అనుకూలము.
- **కదిరి - 6 :** 105-110 రోజుల పంట కాలం, ఎకరానికి వర్షాధారంగా 720-920 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది, నూనె శాతం 48%.
- **కదిరి 7 మరియు 8 (బోల్డ్) :** ఇవి పెద్ద గుత్తి రకము, పంట కాలం 120-125 రోజులు, ఎగుమతికి అనువైనవి, నీటి వసతి ఉన్న రైతాంగానికి అనుకూలం. ఎకరానికి 1600-2000 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది.
- **కదిరి - 9 :** ఇది చిన్న గుత్తి రకం, 115-120 రోజుల పంటకాలం, 45 రోజుల వరకు బెట్టను మరియు పురుగులను, తెగుళ్లను సమర్ధవంతంగా తట్టుకుంటుంది, వర్షాధారంగా ఎకరానికి 800 - 1000 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది. పరిపక్వ నిద్రావస్థ 30 రోజులు. నూనె శాతం 52%.
- **కదిరి హరితాంధ్ర :** జాతీయ స్థాయిలో విడుదలైన చిన్న గుత్తి రకం, పంట కాలం 115 రోజులు, వర్షాధారంగా ఎకరానికి 800 -1000 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది, పంట చివరి వరకూ పచ్చగా వుండటం వలన పాడి రైతాంగానికి అనుకూలం.
- **కదిరి అమరావతి :** ఇది చిన్న గుత్తి రకం, 115 -120 రోజుల పంట కాలం, బెట్టను మరియు పురుగులను మరియు కాండం కుళ్ళు వైరస్ తెగులును సమర్ధవంతంగా తట్టుకుంటుంది, వర్షాధారంగా ఎకరానికి 800-1000 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది. పరిపక్వ నిద్రావస్థ 30 రోజులు, నూనె శాతం 50%.
- **కదిరి చిత్రావతి :** చిన్నగుత్తి రకం, అకుమచ్చ, కాండం కుళ్ళు, మువ్వకుళ్ళు వైరస్, వేరుకుళ్ళు, రసం పీల్చు పచ్చదోమ, తామర పురుగులను తట్టుకుంటుంది. వర్షాధారంగా ఎకరానికి 800-900 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది.
- **కదిరి లేపాక్షి :** చిన్నగుత్తి రకం, అకుమచ్చ తెగుళ్ళను, వైరస్ తెగుళ్లను, రసం పిల్చే పురుగులను, ఆకు తినే పచ్చ, లద్దె పురుగులను తట్టుకుంటుంది. పంట కాలం 110-115 రోజులు. అధిక నూనె శాతం (51%), అధిక మాంసపు కృత్తులను కలిగి ఉంటుంది. తీవ్రమైన బెట్ట పరిస్థితులలో కూడా 600-800 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది. సాధారణ వర్షపాత పరిస్థితులలో ఎకరానికి 1400-1800 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది.
- **ధరణి :** 105-110 రోజుల పంటకాలం, బెట్టను పురుగులను మరియు తెగుళ్లను తట్టుకుంటుంది.
వర్షాధారంగా ఎకరానికి 800-1000 కిలోల కాయ దిగుబడినిస్తుంది.
- **నిత్య హరిత :** పొట్టి రకం, 110-115 రోజుల పంట కాలం, అధిక శాతం 3 గింజల కాయలు, కొద్ది వరకు రసం పీల్చు పురుగులను తట్టుకుంటుంది. పరిపక్వ నిద్రావస్థ 20 రోజులు.
- **ధీరజ్ :** 100-105 రోజుల పంట కాలం, తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ దిగుబడిని ఇస్తుంది. అధిక వేడిని, అధిక చలిని కొంత వరకు తట్టుకుంటుంది. నీటి సదుపాయంతో ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుకు అనుకూలం.
- **ప్రగతి :** 95-100 రోజుల పంట కాలం, పొట్టి రకం, అధిక నీటి వినియోగ సామర్థ్యం ఉన్న రకం, కాయలు నున్నగా, గింజలు ఆకర్షణీయంగా ఉంటాయి.
- విత్తే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తన శుద్ధి కొరకు ఒక కిలో విత్తానానికి 1 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ 600 యఫ్.ఎస్. మందును 6 మి.లీ. నీటిలో కలిపి పట్టించిన అరగంట తరువాత 1.0 గ్రాము టెబ్యుకోనజోల్

2 డి.యస్. లేదా 3 గ్రాములు మాంకోజెబ్ (75% డబ్ల్యు.పి.) పొడి మందును లేదా 2 గ్రాముల స్ప్రింట్ పొడి మందు విత్తనాలకు పట్టించి విత్తుకోవాలి.

- విత్తుకొనే ముందు దుక్కిలో ఎకరానికి 4-5 టన్నుల సేంద్రీయ ఎరువును వేయాలి, భూసారానికి అనుగుణంగా సూటి ఏరువులైన నత్రజని కొరకు యూరియా (18 కిలోలు), భాస్వరం కొరకు సింగల్ సూపర్ ఫాస్ఫేట్ (100 కిలోలు) మరియు పోటాష్ కొరకు మ్యూరేట్ అఫ్ పొటాష్ (35 కిలోలు) ను సిఫారసు చేసిన మోతాదులో అఖరి దుక్కిలో వేసుకోవాలి. జింక్ సల్ఫేట్ ఎకరానికి 20 కిలోలు పైన తెలిపిన ఎరువులతో కలపకుండా వేరుగా చల్లుకోవాలి, కదిరి-7బోల్డ్, కదిరి అమరావతి, కదిరి చిత్రావతి, కదిరి లేపాక్షి రకాలకు పై ఎరువుల మోతాదును నీటి పారుదల క్రింద రెట్టింపు మోతాదులో వేసుకున్నట్లయితే అత్యధిక దిగుబడిని సాధించ వచ్చు.
- కాండం కుళ్ళు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాలో పొలంచుట్టు సజ్జ / జొన్నతో మేరసాళ్ళు (4-6 సాళ్ళు) వేసుకోవాలి.
- వేరుశనగ విత్తే సమయంలో పొలంలో ఒక చదరపు మీటరుకు 33 మొక్కలు ఉండేటట్లుగా చూడాలి.. విత్తన పరిమాణంను బట్టి, ఒక ఎకరానికి 50-60 కేజీలు విత్తనాన్ని విత్తుకోవాలి. కదిరి లేపాక్షి రకానికి 32-35 కిలోల విత్తనాని (30×15 సెం.మీ.) ఎడంగా విత్తుకోవాలి.
- మంచి విత్తనాలతో పాటు ముడతలు లేని చిన్న సైజు గింజలను కూడా విత్తనంగా వాడుకోవచ్చును.
- అంతర పంటగా కందిని 7:1 నిష్పత్తిలో (వేరుశనగ 7 సాళ్ళు : కంది 1 సాలు) విత్తుకొన్నట్లయితే మంచి లాభదాయకంగా ఉంటుంది.
- విత్తిన వెంటనే 48 గంటలు లోపల కలుపు నివారణకు "పెండిమిథాలిన్ 30% ఇ.సి" అనే కలుపు నాశిని 1 ఎకరాకు 1.3 లీటర్లు లేదా 700 మిల్లీ లీటర్ల "స్టాంప్ ఎక్స్ట్రా" ను 200 లీటర్లు నీటిలో కలిపి నేలపై పిచికారి చేయాలి.

**డా॥ కె.యస్.యస్. నాయక్**
ప్రధాన శాస్త్రవేత్త (వేరుశనగ),
వ్యవసాయ పరిశోధనా స్థానం, కదిరి.
చరవాణి : 99896 25217



# ప్రొద్దు తిరుగుడు

- ఖరీఫ్‌లో ప్రొద్దు తిరుగుడు పంటను తేలికపాటి నేలల్లో జూన్ రెండవ పక్షం నుండి జులై మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు.
- ఈ పంటను ఏక పంటగాను లేదా వేరుశనగ, కంది మరియు కొర్ర పంటలతో అంతర పంటగాను వేసుకోవచ్చు.
- భూమిని నాలుగైదు సార్లు బాగా దున్ని మెత్తటి దుక్కిని తయారు చేసి తరువాత చదును చేసి విత్తనము వేసుకోవాలి.
- ఎకరానికి 2 కిలోల విత్తనము సరిపోతుంది.
- ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, నంద్యాల నుండి విడుదలైన ప్రభాత్ (ఎన్.డి.ఎస్.హెచ్. 1012) అను సంకర రకం విత్తనం అందుబాటులో ఉంది. ఇది అధిక దిగుబడి మరియు అధిక నూనె శాతము గల సంకర రకం.
- నెక్రోసిస్ వైరస్ తెగులు అధికంగా ఆశించు ప్రాంతాలలో కిలో విత్తనానికి ఇమిడాక్లోప్రిడ్ (గౌచో) 5 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 4 గ్రా. మందులను ఉపయోగించి విత్తన శుద్ధి చేయాలి.
- ఈ పంటకు 24:24:12 కిలోల నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు ఎకరాకు అవసరం. భూసార పరీక్ష ద్వారా భాస్వరం మధ్యస్థం నుండి అధికంగా ఉన్నట్లయితే భాస్వరం ఎరువులు వేయవలసిన అవసరం లేదు.
- గంధకం తక్కువగా ఉన్న నేలల్లో (<10 పి.పియం.) ఎకరానికి 55 కిలోల జిప్సం వేయాలి.
- సరైన మొక్కల సాంద్రత కొరకు తేలిక నేలల్లో వరుసల మధ్య 45 సెం.మీ. మరియు మొక్కల మధ్య 20-25 సెం.మీ. మరియు బరువు నేలల్లో వరుసల మధ్య 60 సెం.మీ. మరియు మొక్కల మధ్య 30 సెం.మీ. దూరం పాటించాలి.
- కలుపు నివారణకు పెండిమిథాలిన్ 30% అనే మందును

లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున కలుపుకొని విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పిచికారి చేసుకోవాలి.

- విత్తిన 10-15 రోజుల తరువాత కుదురుకు ఒక ఆరోగ్యవంతమైన మొక్కను ఉంచి మిగిలిన మొక్కలను తీసివేయాలి.

**డా॥ యస్. నీలిమ,** శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం)
చరవాణి : 73820 13738
**డా॥ కె. వెంకటరమణమ్మ,** శాస్త్రవేత్త (మొక్కల తెగుళ్ళ శాస్త్రం)
చరవాణి : 99088 29618
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల.




- జూన్ మాసం నందు వేసిన ఆముదము పంటలో 15-20 రోజులు తర్వాత కణుపుకు ఒక మొక్క ఉండే లాగా ఒత్తు మొక్కలను పీకి వేయాలి. అదే సమయంలో మొలవని చోట కొత్త గింజను విత్తుకోవాలి.
- మొక్కలు మొలిచిన చోట 20 రోజులకు అంతర కృషితో పాటు ప్రతి చాలుకు తేమ సంరక్షణ చాలు వేసుకున్నట్లయితే తేమ మరియు మట్టి సంరక్షణ జరిగి పంట ఎదుగుదలకు మరియు బెట్ట పరిస్థితులను తట్టుకోవడానికి ఉపయోగ పడుతుంది.
- పంట 25-30 రోజులు ఉన్న చోట కలుపు నివారణకు గుంటక లేదా గొర్రుతో అంతర కృషి చేసుకోవాలి.
- గాలిలో మరియు నేలలో తేమ అధికంగా ఉన్నప్పుడు లేదా నీరు నిలువ ఉండే ప్రదేశాలలో మొలక కుళ్ళు తెగులు సోకి ఆకులు వాడి కుళ్ళిపోయి మొక్కలు చనిపోయే అవకాశం వుంది. తీవ్రత ఎక్కువగా వున్నప్పుడు మెటలాక్సిల్ పొడి మందును 2 గ్రాముల చొప్పున ఒక లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలి.
- వర్షాధారంగా ఆముదము పంట సాగు చేయటానికి జులై మాసం చివరి వరకు అనుకూలం. రైతులు మంచి దిగుబడినిచ్చే రకాలు లేదా సంకర జాతి రకాలకై ఈ క్రింది ఇచ్చిన చిరునామాలను సంప్రదించగలరు. క్రాంతి, హరిత, కిరణ్, ప్రగతి రకాలను మరియు పి.సి.హెచ్.-111, పి.సి.హెచ్.-222 అను హైబ్రిడ్‌లను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం నుండి పొందవచ్చు. జ్యోతి, జ్వాల, డి.సి.ఎస్.-107 రకాలను మరియు డి.సి.హెచ్.-519, డి.సి.హెచ్.-177, ఐ.సి.హెచ్-66 హైబ్రిడ్‌లను అఖిల భారత నూనె గింజల పరిశోధనా సంస్థ, రాజేంద్ర నగర్ నుండి పొందవచ్చు.
- ఎకరానికి 2 టన్నుల పశువుల ఎరువును దుక్కిలో వేసి కలియ దున్నాలి. విత్తేటప్పుడు 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం మరియు 12 కిలోల పొటాషియం ఇచ్చే సూటి ఎరువులను వేసుకోవాలి.
- ఒక కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ / కాప్టాన్ పొడి మందును కలిపి విత్తన శుద్ధి చేయటం వలన మొలక కుళ్ళు తెగులు (ఫైటోఫ్తోరా బ్లైట్), ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు మరియు కొంతవరకు వడలు తెగులును అరికట్టవచ్చు. వడలు తెగులు ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండెజిమ్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేయాలి.
- వర్షాధారంగా సాగు చేసినప్పుడు అధిక దిగుబడికై సిఫారసు చేసిన 90 × 60 సెం.మీ.ల కనీస దూరం పాటించాలి. డ్రిప్పు పద్ధతిలో లేటరల్ లేటరల్‌కు మధ్య 120 సెం.మీ. దూరము, డ్రిప్పుకు డ్రిప్పుకు మధ్య దూరము 45 సెం.మీ. 4 లీ. డిశ్చార్జి గల డ్రిప్పులు వాడి $2^1/_2$-8 గంటలు మూడు రోజుల కొకసారి నీటిని ఇస్తే మంచి దిగుబడులు సాధించవచ్చును.
- ఎద్దుల వెంట గొర్రుతో విత్తటం, బోదెల మీద చేతితో విత్తటం మామూలు పద్ధతి. అనంత విత్తు పరికరంతో ఆముదమును తక్కువ సమయంలో అధిక విస్తీర్ణంలో విత్తవచ్చు.
- ఆముదంలో అంతర పంటలుగా వేరుశనగ 1:5 నిష్పత్తిలో సజ్జ / జొన్న/ గోరు చిక్కుడు/ అలసంద పంటలు 1:2 నిష్పత్తిలో, కంది పంట 1:1 నిష్పత్తిలో వేయవచ్చు.

**డా॥ ఎ.వి.ఎస్. దుర్గాప్రసాద్,**
శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం), చరవాణి : 95817 00298
**డా॥ వై. పవన్ కుమార్ రెడ్డి,** శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం)
వ్యవసాయ పరిశోధనా స్థానం. అనంతపురము.
చరవాణి : 99669 70300




ఎర్లీ ఖరీఫ్‌లో విత్తిన నువ్వు పంట పూత, కాయ దశలలో ఉంటుంది. ఈ దశలో తప్పని సరిగా నీరు పెట్టాలి.

**సస్యరక్షణ :**

**రసం పీల్చే పురుగులు (తామర పురుగులు / దోమ) :** పిల్ల, తల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చివేస్తాయి. పురుగులు ఆశించిన ఆకులు ముందుగా పాలి పోయి, తరువాత ఎండిపోతాయి. తెల్ల నల్లి ఆశిస్తే ఆకులు ముదురు ఆకు పచ్చ రంగుకు మారి ఈనెలు పొడవుగా సాగి క్రింద వైపునకు ముడుచుకొని పోయి, గోనె ఆకారంగా మారి పాలిపోతాయి.

**నివారణ :** మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. తెల్ల నల్లి నివారణకు డైకోఫాల్ 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**వెర్రి తెగులు / పుట్ట జుత్తు / ఫిల్లోడి :** ఈ తెగులు పూత సమయంలో ఆశిస్తుంది. సాధారణంగా ఆలస్యంగా వేసిన పంటతో ఎక్కువగా వస్తుంది. తెగులు సోకిన మొక్కల్లో ఆకులు చిన్నవై పువ్వులోని భాగాలన్ని ఆకులు మాదిరిగా మారిపోయి కాయలు ఏర్పడవు. మొక్కల ఎదుగుదల తగ్గి, పై భాగం, చిన్న ఆకులు గుబురుగా ఉండి వెర్రితల మాదిరిగా ఉంటుంది. ఈ తెగులు దీపపు పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

**నివారణ :** తెగులు కనిపించిన వెంటనే తెగులు సోకిన మొక్కలను పీకి తగలబెట్టాలి. చేనుపై మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**వేరు కుళ్ళు, కాండం కుళ్ళు తెగులు :** కాండం మీద నల్లని చారలేర్పడతాయి, వేర్లు పాక్షికంగా లేదా పూర్తిగా కుళ్ళిపోతాయి. మొక్క మొత్తం ఎండిపోతుంది.

**నివారణ :** కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలు మొదళ్ళలో వేరు తడిచేలా పిచికారి చేయాలి.

**ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు :** ఆకులపై, కాండం మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. ఆకులు ఎండి రాలి పోతాయి.

**నివారణ :** కార్బండెజిమ్ 1 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**డా॥ టి. తులసీ లక్ష్మీ**
శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) మరియు అధిపతి,
వ్యవసాయ పరిశోధనా స్థానం, యలమంచిలి, విశాఖపట్నం జిల్లా.
ఫోన్ నెం. 89853 70076




జులై మాసము పశుగ్రాసాల సాగుకు ఎంతో అనుకూలం. ఋతుపవనాలు జూన్ మాసంలో మొదలైనప్పటికీ, జులై మాసంలో బాగా విస్తరిస్తాయి. రైతాంగం ఈ వర్షాలకు అనుగుణంగా అన్ని రకాల ఏకవార్షిక పశుగ్రాస పంటలను విత్తుకోవచ్చును. ధాన్యపు జాతి మరియు పప్పు జాతి పశుగ్రాస పంటలను మిశ్రమ పంటలుగా సాగు చేసుకొని, వాటిని పశువులకు ఆహారంగా అందించుట వలన అధిక లాభాలను అర్జించవచ్చును. పశుగ్రాస జొన్నలో ప్రధాన రకాలైన పంత్‌చారి 1, సి.యస్.హెచ్. 24 యమ్.ఎఫ్., యస్.యస్.జి. 59-3 రకాలను ఎకరాకు 10 కిలోల వంతున, బహువార్షిక రకాలైన కో.ఎఫ్.ఎస్. 31 రకమును ఎకరాకు 3 కిలోల వంతున విత్తుకోవాలి. వరుసల మధ్య దూరం 30 సెం.మీ., వరుసలో మొక్కల మధ్య దూరం 10 సెం.మీ. ఉండేటట్లు సాగు చేసుకోవాలి. పశుగ్రాస మొక్కజొన్నలో ఆఫ్రికన్‌టాల్, టి.యస్.ఎఫ్.బి. రకాలను ఎకరాకు 20 కిలోల చొప్పున విత్తుకోవాలి. వరుసల మధ్య దూరం 30 సెం.మీ. లేదా 45 సెం.మీ. ఉంటేటట్లు చూసుకోవాలి. పశుగ్రాస జొన్నకు దుక్కిలో 12 నుండి 16 కిలోల నత్రజని, అదేవిధంగా పశుగ్రాస మొక్కజొన్నకు 20 నుండి 24 కిలోల నత్రజనిని వేసుకోవాలి. అలాగే 16 కిలోల ఫాస్ఫరస్, 12 కిలోల భాస్వరం కూడా దుక్కిలో వేసుకోవాలి. జింక్ పోషక లోప నివారణకు 8 కిలోల జింక్ సల్ఫేట్‌ను దుక్కిలో వేసుకోవాలి. ధాన్యపు జాతి పశుగ్రాసాలను సాగు చేయునప్పుడు తొలిదశలో కలుపు నివారణ కొరకు, విత్తిన

వెంటనే లేదా 48 గంటల లోపు అట్రజిన్ కలుపు మందును 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**డా॥ యస్. తిరుమల రెడ్డి,** శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం)
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి.
చరవాణి : 94920 73308




• సాధారణంగా మన రాష్ట్రంలో నైఋతి ఋతుపవనాలు జూన్ మొదటి వారంలో ప్రవేశిస్తాయి, కావున వర్షాధారంగా పండించే పంటలు మరియు పండించే కాలము జూన్ రెండవ వారంలో ప్రారంభమై అక్టోబర్ చివరి వరకు ఉంటుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో కురిసే వర్షము, భూమిలో నిల్వ ఉండే తేమను బట్టి, పంట కాల పరిమితి వర్షాధారపు ఎర్ర నేలల్లో 90- 150 రోజులు, నల్ల రేగడి నేలల్లో 150 -180 రోజులు ఉంటుంది. • భూమి వాలుగా ఉంటే, కాంటూరు సేద్యం (వాలుకడ్డంగా విత్తడము, అంతర కృషి చేయడము) చేసుకోవడం వలన నీటి ఒరవడిని ఎక్కడికక్కడే అరికట్టి ఎక్కువ నీటిని భూమిలోనికి ఇంకింప చేసుకోవచ్చు. • వర్షాధార భూముల్లో అనువైన పంటలు వేసిన తరువాత, పడిన వర్షపు నీరు భూమిలో ఎక్కువగా ఇంకేందుకు నాగలితో సుమారు 1-3 మీటర్లకు ఒకటి చొప్పున తేమసంరక్షణా చాళ్ళను లోతుగా, పంట విత్తిన తరువాత 25-30 రోజులకు తీయవలెను. ఈ తేమ సంరక్షణా చాళ్ళు, సాధారణ వర్షం కురిసినప్పుడు వర్షపు నీటిని అడ్డగించి భూమిలోనికి ఇంకునట్లు చేసి పంటకు ఎక్కువ కాలం తేమను అందజేస్తాయి. అధిక వర్షం కురిసినప్పుడు నీటి ప్రవాహం వలన మట్టి కొట్టుకొని పోకుండా మురుగనీటి కాలువ లాగా కూడా పనిచేస్తాయి.

• నల్లరేగడి నేలల్లో వెడల్పాటి బోదెలు మరియు కాలువలుగా నేలను తయారుచేసి, వెడల్పాటి బోదెలపైన విత్తుకోవాలి. కాలువలు ఎక్కువ నీటిని బయటికి పంపడానికి ఉపయోగపడతాయి. లోతైన నల్లరేగడి నేలలకు ఈ పద్ధతి అనుకూలం. అంతే గాక, ప్రతి 3 మీటర్ల వెడల్పుతో 20 సెం.మీ. ఎత్తుగల ఎత్తైన వెడల్పాటి బోదెలు వేసి విత్తుకొన్నచో మంచి దిగుబడులు వస్తాయి. బోదెల ప్రక్కన కాలువలు తక్కువ వర్షం వచ్చినప్పుడు నీరు ఇంకడానికి, ఎక్కువ వర్షం వచ్చినప్పుడు నీరు బయటకు పోవడానికి ఉపయోగపడతాయి. • వేరుశనగలో అంతరపంటగా కందిని వేసేటప్పుడు కందితో పాటు వర్షపు నీటి ఒరవడిని అరికట్టే పంటలైన ఉలవ, అలసంద కలిపి విత్తితే, నేల మరియు వర్షపు నీటిని సంరక్షించి, బెట్ట పరిస్థితుల్లో కూడా అధిక దిగుబడితో పాటు అధిక నికర ఆదాయం పొందవచ్చు. • వర్షాధార ఎర్రనేలల్లో ముఖ్యంగా వేరుశనగ, కంది, ఆముదము, జొన్న మరియు సజ్జ పంటలను జూన్ - జులై నెలల్లో విత్తుకోవచ్చును. • నల్లరేగడి నేలల్లో ప్రత్తి, కంది మరియు ఆముదము పంటలను జూన్ - జులై నెలల్లో విత్తుకోవచ్చును. • వేరుశనగలో భూసార పరీక్షలను అనుసరించి ఎరువులను వేసుకోవాలి. వీలైనంత వరకు, సూటి ఎరువులు వాడటం మంచిది. తద్వారా, మొక్కలకు కావాల్సిన పోషకాలు సమాన మోతాదులో అందడమే కాక, ఖర్చు కూడా తగ్గుతుంది. • మన రాష్ట్రంలో భాస్వరం చాలా వరకు కరగని స్థితిలో భూమిలో నిలువ ఉంది. కావున, నేలలో భాస్వరాన్ని కరిగించే జీవన ఎరువులు ఫాస్ఫేట్ సాల్యుబులైజింగ్ బాక్టీరియా 5 కిలోలు మరియు ఫాస్ఫేట్ మొబిలైజింగ్ మైకోరైజా 12.5 కిలోలు ఒక హెక్టారుకు వేసుకున్నట్లయితే మంచి దిగుబడిని సాధించవచ్చు మరియు ఎరువులకయ్యే ఖర్చును కొంతవరకు తగ్గించుకోవచ్చు. • కొందరు రైతులు వేరుశనగలో లావు గింజలను మాత్రమే వేరు చేసి విత్తుతున్నారు. తద్వారా, సాగు ఖర్చు పెరుగుతుంది. అలా కాకుండా, వేరుశనగలో కాయల నుండి వచ్చే చిన్న, సన్న విత్తనాలను కలిపి కూడా విత్తుకోవడం వలన వేరుశనగ దిగుబడులలో ఎలాంటి తగ్గుదల ఉండదు, సాగు ఖర్చు తగ్గుతుంది. • వర్షాధారపు ఎర్ర నేలల్లో తేమ తక్కువ రోజులు నిలువ ఉంటుంది, కావున విత్తే సమయం తక్కువగా ఉంటుంది. కావున, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణం లో విత్తాలంటే ఆటోమాటిక్ వేరుశనగ విత్తు పరికరముతో సరిపడా తేమ ఉన్నప్పుడు మాత్రమే విత్తుకొనవలెను. • ఎర్ర నేలల్లో వేరుశనగ + కంది అంతర పంటలుగా 7:1/11:1/15:1 నిష్పత్తిలో విత్తుకోవడం వలన అధిక నికర ఆదాయం పొందవచ్చు.

• వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురం శాస్త్రవేత్తలు వేరుశనగ + కంది (8:1) విత్తే పరికరాన్ని (9 కొయ్యలు) రూపొందించారు. దీని వలన పొలం అంతా సమానంగా ప్రతి 8 వరుసలు వేరుశనగ, 1 వరుస కందిని విత్తుకోవచ్చు.

**డా॥ బి. సహదేవ రెడ్డి**
ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి, మెట్ట వ్యవసాయం
వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురము.
చరవాణి : 99896 25222

# ప్రస్తుత ఖరీఫ్ 2022-23 లో ప్రధాన పంటల అంచనా ధరలు


డా॥ జి. రఘునాథ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (ఆర్థిక శాస్త్రం);
డా॥ యం. చంద్రశేఖర్ రెడ్డి, శాశ్వత కార్యనిర్వహక సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ అగ్రిమిషన్, డా॥ కె. ప్రవల్లిక,
సహాయ పరిశోధకురాలు (ఆర్థిక శాస్త్రం), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాం.

పంట సాగుదారులకు (యజమాని/ కౌలుదారు) వారి ఉత్పత్తి వనరులను శాస్త్రీయ పరంగా వాడుకోవడం తో పాటు మార్కెటింగ్‌తో సంబంధం ఉన్న నష్టాలను తగ్గించడంలో మార్కెట్ సమాచారం చాలా ముఖ్యమైనది. ప్రస్తుతం, పంటల మార్కెట్ ధరలు స్థానిక ప్రాంతం లేదా దేశ అవసరాలపై కాక, విదేశాల సరఫరా మరియు డిమాండ్ శక్తులపై ఆధారపడి ఉన్నాయని మనం గమనించాలి. ఈ నేపథ్యంలో రైతులకు మార్కెట్ సమాచారాన్ని అందించడం, తదనుగుణంగా పంటల సరళిని రూపొందించుకొనడం ఎంతైనా అవసరం.

గుంటూరు జిల్లా, లాం లోని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2019 లో ఏర్పాటైన వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం సమగ్ర కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ప్యాకేజీల ద్వారా శాస్త్రీయ మూల్యాంకనాన్ని అవలంబిస్తు, గత 25-30 సంవత్సరాల మార్కెట్ ధరలకు సంబంధించిన సమాచారాన్ని దృష్టిలో ఉంచుకొని, మార్కెట్ సర్వేల ద్వారా కార్యనిర్వాహకుల అభిప్రాయాన్ని తెలుసు కుంటూ మరియు విశ్వవిద్యాలయ గణాంకాల విభాగ నిపుణుల సలహాలతో ఖచ్చితమైన ప్రమాణాల ఆధారంగా 86.54%-96.38% ఖచ్చితత్వంతో ముందస్తు ధరలను ఎప్పటికపుడు రైతు సోదరులకు అందించుచున్నది.

ప్రస్తుతం రాబోయే ఖరీఫ్ 2022-23 కాలానికి విశ్లేషణ చేసి వరి, మొక్కజొన్న, పసుపుతో పోలిస్తే అపరాలు, మిర్చి, ప్రత్తి, పొద్దుతిరుగుడు మరియు చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తాయని మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం ప్రకటించింది.

2022-23 కనీస మద్ధతు ధరని రాబోయే ఖరీఫ్ పంట ధరలతో పోల్చినట్లయితే, ప్రత్తి ధర ఎక్కువగా మరియు వరి, మొక్కజొన్న, కందులు, మినుము, వేరుశనగ ధరలు కనీస మద్ధతు ధరకి దగ్గరగా ఉంటాయని అంచనా. పసుపుతో పోలిస్తే మిర్చి ధర చాలా లాభసాటిగా ఉండవచ్చు. పసుపు పంటకు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం 2022-23 పంట కాలానికి కనీస మద్ధతు ధర




రూ. 6850/- గా ప్రకటించింది, కాబట్టి సాగుదారులు దీనిని కూడా ఎంచుకోవచ్చు.

వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం అంచనా ప్రకారం రాబోయే ఖరీఫ్ కాలంలో వరితో పోల్చితే కందులు,

**పట్టిక : 2022-23 ఖరీఫ్ లో ప్రధాన పంటల అంచనా ధరలు :**

| సం. | పంట | | అంచనా ధర | వర్తించే కాలం (2022-23) | కనీస మద్ధతు ధర (2021-22) |
|---|---|---|---|---|---|
| 1 | వరి | సాధారణ రకం | 1700-1900 | నవంబర్-డిసెంబర్ | 2040 |
| | | ఏ-గ్రేడ్ రకం | 1800-2000 | | 2060 |
| 2 | ప్రత్తి | | 6500-7000 | నవంబర్-ఫిబ్రవరి | 6080 & 6380 |
| 3 | మిర్చి | సాధారణ రకం | 14000-16000 | జనవరి-ఏప్రిల్ | - |
| | | ప్రత్యేక రకం | 17000-18500 | | |
| 4 | పసుపు | కాయలు | 5700-7000 | ఫిబ్రవరి-ఏప్రిల్ | 6850 |
| | | కొమ్ములు | 5800-6300 | | |
| 5 | మొక్కజొన్న | | 1850-2100 | అక్టోబర్-డిసెంబర్ | 1962 |
| 6 | జొన్న | | 1900-2100 | అక్టోబర్-నవంబర్ | 2990 |
| 7 | కందులు | | 5600-6100 | జనవరి-మార్చి | 6600 |
| 8 | మినుము | | 6100-6400 | సెప్టెంబర్-నవంబర్ | 7755 |
| 9 | పెసలు | | 6200-6550 | సెప్టెంబర్-నవంబర్ | 7755 |
| 10 | శనగ | | 4700-5000 | ఫిబ్రవరి-మార్చి | - |
| 11 | వేరుశనగ | | 5300-5700 | డిసెంబర్-జనవరి | 5850 |
| 12 | పొద్దుతిరుగుడు | | 6200-6500 | సెప్టెంబర్-నవంబర్ | 6440 |
| 13 | సోయాబీన్ | | 6000-6300 | సెప్టెంబర్- అక్టోబర్ | 4300 |
| 14 | బెల్లం | | 3300-3700 | - | - |

మినుము, పెసలు, వేరుశనగ, ప్రత్తి, మిర్చి, మొక్కజొన్నల సాగుకు మార్కెట్‌లో మంచి ధరలు మరియు తక్కువ ఉత్పత్తి ఖర్చు కారణంగా రైతులు మంచి రాబడిని పొందవచ్చు. కేంద్ర ప్రభుత్వం 2022-23 కు గాను ప్రకటించిన కనీస మద్ధతు ధరతో సంబంధం లేకుండా భారీ ముందస్తు నిల్వలు ఉన్నందున వరి యొక్క ధరలు రాబోయే కాలంలో కూడా స్థిరంగా కొనసాగుతాయి. ప్రస్తుతం ఉన్న కనీస మద్ధతు ధర తో పోలిస్తే, రష్యా మరియు ఉక్రెయిన్ సంక్షోభాల కారణంగా రాబోయే ఖరీఫ్ కాలంలో పొద్దు తిరుగుడుకు మరింత ధర ఉండగలదని అంచనా. జన్యుమార్పిడి (నాన్-జి.యం.) కాని సోయాబీన్‌కు అంతర్జాతీయంగా డిమాండ్ ఎక్కువగా ఉంటుందని అంచనా వేయబడినందున, ఆంధ్రప్రదేశ్ రైతులు పంట మార్పిడికి ఒక మంచి అవకాశంగా భావించవచ్చు.

వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం ఇప్పటి వరకు విడుదల చేసిన అంచనా ధరల వివరాలను వెబ్ సైట్ www.angrau.ac.in నందు పొందుపరిచారు. ఈ సమాచారం విశ్వవిద్యాలయ పరిశోధన & విస్తరణ విభాగాలను మరియు రైతు భరోసా కేంద్రాలని (ఆర్.బి.కె.) సంప్రదించి రైతులు పంట సాగు నిర్ణయాలను తీసుకునేలా వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం సేవలు కొనసాగించుచున్నది. తదుపరి పంట కాలంలో సాధారణ వాతావరణ పరిస్థితులు ఉండగలవని మరియు దేశీయ & అంతర్జాతీయ డిమాండ్‌లో ఎలాంటి అసాధారణ మార్పులు ఉండవన్న ఆలోచనతో వ్యవసాయ మార్కెట్ ఇంటెలిజెన్స్ కేంద్రం ఈ విశ్లేషణ ఫలితాలను వెల్లడించింది.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : **98483 21232, 1800 419 8800**

# నేరుగా వరి విత్తి సాగు చేయు పద్ధతిలో మెళకువలు

డా॥ యం. గిరిజా రాణి, సీనియర్ శాస్త్రవేత్త (మొక్కల ప్రజనన శాస్త్రం); వ్యవసాయ పరిశోధనా స్థానం, మచిలీపట్నం
మరియు డా॥ యం. వెంకటరాములు, సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం);
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, లాం, గుంటూరు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వరి సాగు 23.076 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు అవుతుంది. సార్వాలో 15.6 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో, దాళ్వాలో 7.4 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. వరి సాగు ప్రధానంగా ఊడ్పు పద్ధతిలో సాగు చేస్తున్నారు. అయితే సుమారు 25 శాతం విస్తీర్ణంలో రైతులు నేరుగా వరి విత్తి సాగు చేయు పద్ధతి వైపు సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల కాలంలో కూలీల కొరత నేపధ్యం, కొవిడ్ 19 లో కూలీల కొరత తీవ్రత వలన రైతులు నేరుగా వరి విత్తి సాగు పద్ధతి చేస్తున్నారు. ఈ సాగు పద్ధతి దాళ్వాలో చేయుట వలన గోదావరి జిల్లాలో రైతాంగం అధిక దిగుబడులు పొందిన సందర్భాలు ఉన్నాయి. కృష్ణా డెల్టాలో రైతులు సార్వాలో వరి వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తున్నారు.

నేరుగా వరి విత్తి సాగు పద్ధతి దుక్కి దున్ని సాగు చేయటం కృష్ణా డెల్టాలో ఎక్కువ ప్రాచుర్యంలో ఉంది. గోదావరి డెల్టాలో దమ్ము చేసి వెదజల్లుట చేయుచున్నారు. ఈ సాగు పద్ధతిలో నేలలు ఎంపిక, విత్తనం ఎంపిక, అనగా రకాల ఎంపిక, నీటి యాజమాన్యం, సాగులో చేపట్టవలసిన మెళకువలు గురించి ఈ రోజు చర్చించుకుందాం.

నీరు నిలబడని పొలాలు అనగా నీరు బయటకు తీయటానికి వీలున్న పొలాలు ఈ సాగుకు అనుకూలం. పల్లపు పొలాలు, ముంపు మరియు చౌడుకు గురి అయ్యే పొలాలు వెదజల్లు పద్ధతి సాగుకు అనుకూలం కాదు. సార్వాలో అకాల మరియు అధిక వర్షాలు ఉండటం వలన మెరక ప్రాంతంలో మాత్రమే ఈ పద్ధతిలో సాగు చేయవచ్చు. దాళ్వాలో నీరు తీయటానికి వీలున్న పొలాలు ఈ సాగుకు అనుకూలం.

### నేరుగా వరి విత్తి సాగు పద్ధతిలో ఉపయోగాలు :

సాధారణంగా వరి పంట సాగుకు నీరు ఎక్కువగా వాడటం, ఊడ్పు పద్ధతిలో సాగు వలన మీథేన్ వాయువు ఎక్కువగా వాతావరణంలోకి విడుదల అవుట వలన గ్లోబల్ వార్మింగ్‌కు కూడా కారణం అవుతుంది. అయితే నేరుగా వరి విత్తి పద్ధతిలో సాగు వలన కొంత వరకు మీథేన్ వాయువు విడుదల తగ్గటం వలన పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది.

అలాగే నీటి వినియోగం 25 శాతం ఊడ్పు పద్ధతి మీద తగ్గుతుంది. ఆరు తడి వరి సాగులో నారుమడి, దమ్ము చేయుటకు అవసరమైన నీరు, దమ్ము ఖర్చు ఆదా అవుతుంది. దమ్ము చేసి నేరుగా వెదజల్లే పద్ధతిలో కేవలం నారుమడి వాడే నీరు ఆదా అవుతుంది. అలాగే కూలీల ఖర్చు ఎకరానికి 2500 నుండి 3000 రూపాయల వరకు ఆదా అవుతుంది. ఎందుకంటే నారు పెంపకం, నారు పీకడం, నాటు వేసే పని ఉండదు.

అలాగే విత్తనం ఎకరానికి 12-15 కిలోలు ఆదా అవుతుండటం వలన విత్తనం ఖర్చు తగ్గుతుంది. సరియైన విత్తన మోతాదు వాడటం వలన మొక్కల సాంద్రత సక్రమంగా ఉండుట వలన అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుంది. అలాగే తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో విత్తుకోవచ్చు. ప్రతికూల పరిస్థితులలో వరి సాగు ఆలస్యం అయినప్పుడు నేరుగా వరి విత్తి సాగు పద్ధతిలో సాగు చేయుట వలన సమయం ఆదా అవుతుంది. వరి పంట సాధారణ ఊడ్పు పద్ధతి కన్నా 7 నుండి 10 రోజుల కన్నా కోతకు ముందు వస్తుంది.

### నేరుగా వరి విత్తి సాగు పద్ధతిలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు :

- సరియైన వరి రకాలు ఎంపిక చేయకపోవుట వలన అంటే పడిపోయే స్వభావం ఉన్న రకాలు సాగు చేయుట వలన ఈ సాగు పద్ధతిలో చేలు త్వరగా పడిపోతాయి.
- నేల సరిగా చదును చేయకపోవుట, నీరు బయటకు పోవటానికి వీలు లేని భూములలో సాగు చేయుట వలన, సమస్యాత్మక భూములైన చౌడు మరియు ముంపుకు గురిఅయ్యే పొలాల్లో సాగు చేయుట వలన తొలకరిలో అధిక

వర్షాలు వలన ఒకోసారి పైరు పూర్తిగా చనిపోయి మరలా విత్తుకునే పరిస్థితి వలన విత్తన ఖర్చు, విత్తే ఖర్చు ఎక్కువ అవుతుంది.

- సరియైన సమయంలో కలుపు మందులు వేయకపోవుట వలన దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి.
- మొక్కలు చనిపోయి సాంద్రత తగ్గినప్పుడు మనేద (పొడి) మొక్కలకు నారు లేక వేరే రకం నారు వాడుట వలన ధాన్యం నాణ్యత తగ్గుతుంది.
- అధిక మోతాదులో ఎరువులు వాడుట వలన కాండం మెత్తబడి చేలు త్వరగా పడిపోవడం. అలాగే ఎక్కువగా చీడపీడలకు గురి అవటం జరుగుతుంది.
- అలాగే ఈ పద్ధతిలో సాగు చేసినప్పుడు, వరి పంట వారం నుండి 10 రోజులు ముందు రావటం జరుగుతుంది. రైతులు మిషన్ కోత కోసం అని ఎక్కువ రోజులు నీరు ఎండగట్టడం వలన ధాన్యం ముక్క అయ్యే అవకాశం ఉంది.

**నేరుగా వరి విత్తి సాగు పద్ధతికి వరి రకాల ఎంపిక :**

ఈ సాగు పద్ధతిలో కాండం ధృడంగా ఉండి, చేనుపై పడని రకాలను ఎంపిక చేసుకోవాలి. కోస్తా జిల్లాలలో నిద్రావస్థ కలిగిన రకాలను ఎంపిక చేసుకోవాలి. తొలకరిలో సాగు చేయుచున్నప్పుడు మొలక దశలో నీటి మునకను తట్టుకునే శక్తి కలిగి ఉండాలి. మొక్క శాఖీయ పెరుగుదల దశలో వేగంగా పెరిగి కలుపును అణగదొక్క గల శక్తిని కలిగి ఉండాలి. పిలకలు మధ్యస్థంగా పెట్టగలిగి ఆయా ప్రాంతాలలో అధికంగా వచ్చే చీడపీడలను తట్టుకునే శక్తి కలిగి ఉండాలి. గింజ రాలిక బాగా తక్కువగా ఉండాలి. రకాల ఎంపికలో రైతులకు అధిక దిగుబడినిస్తూ అధిక బియ్యం దిగుబడినిచ్చి, కొనుగోలులో ఇబ్బంది లేని రకాలను ఎంపిక చేసుకోవాలి.

**దీర్ఘకాలిక రకాలు (150 రోజుల కాలపరిమితి కలిగి చేనుపై పడకుండా ఉండే రకాలు) :** యం.టి.యు. 1262, బి.పి.టి. 2782, బి.పి.టి. 2595, బి.పి.టి. 2270 మరియు విడుదలకు సిద్ధంగా ఉన్న యం.టి.యు. 1318.

**మధ్యకాలిక రకాలు (140 రోజుల కాలపరిమితి కలిగి చేనుపై పడకుండా ఉండే రకాలు) :** యం.టి.యు. 1140, యం.సి.యం. 100, యం.టి.యు. 1224, యం.టి.యు. 1210. రైతులు ఎక్కువగా సాగు చేయు యం.టి.యు 1061, యం.టి.యు. 7029, బి.పి.టి. 5204 రకాలు నేరుగా వరి విత్తే పద్ధతిలో సాగు చేయుట వలన ప్రతికూల వాతావరణ పరిస్థితులలో ఇబ్బంది పడుతున్నారు.

సాధారణంగా వరి రకాలు 5 నుండి 7 రోజుల వరకు మొలక దశలో అనగా విత్తిన వెంటనే మునిగినప్పుడు 75 శాతం మేర మొలకెత్తే అవకాశం ఉంటుంది. యం.టి.యు. 1140 రకానికి రెండు వారాల వరకు మొలకెత్తే దశలో నీట మునిగినప్పటికి మొలకెత్తే శక్తి ఉండి నేరుగా వెదజల్లే సాగు పద్ధతికి కూడా అనుకూలం. పైన తెలిపిన రకాలలో యం.టి.యు. 1140 ముంపు ప్రాంతాలలో సాగుకు మరియు యం.సి.యం. 100 రకం చౌడు ప్రాంతాలలో సాగుకు అనుకూలం.

**నేల తయారీ :**

**దుక్కి దున్ని సాగు చేయు పద్ధతిలో (ఆరుతడి వరి సాగు) :** పొలంలో మట్టి పెడ్డలు లేకుండా దున్నుకోవాలి. నేల చదునుగా ఉండాలి అలాగే పొలం వాలును బట్టి నీరు బయటికి పోవుటకు వీలుగా ప్రతి 2 మీటర్లకు గాడులు చేసుకోవడం వలన తర్వాత ఎరువులు వేయుటకు, కలుపు మందులు వేయుటకు, సస్యరక్షణ చర్యలు చేపట్టుటకు కాలిబాటలు ఉపయోగపడటమే కాకుండా దోమపోటు ఎక్కువగా ప్రబలకుండా ఉంటుంది.

**దమ్ము చేయు పద్ధతిలో :** ఊడ్పు పద్ధతికి దమ్ము చేసినట్లు దమ్ము చేసి పొలమంతా చదును చేయాలి. నీరు బయటికి పోవటానికి వీలుగా ప్రతి 2 మీటర్లకు 20 సెంటీ మీటర్ల బాటలు (గాడులు) చేసుకోవాలి.

**విత్తన మోతాదు :** దుక్కి దున్ని వెదజల్లే పద్ధతిలో గొర్రులు వేయునప్పుడు ఎకరానికి 20 నుండి 25 కిలోలు విత్తనం సరిపోతుంది. దమ్ము చేసి నేరుగా విత్తినప్పుడు ఎకరానికి 12 నుండి 16 కిలోల విత్తనం అవసరం అవుతుంది. దమ్ము చేసి డ్రమ్ సీడర్‌లో విత్తినప్పుడు 10 నుండి 12 కిలోల విత్తనం అవసరం అవుతుంది.

**విత్తే విధానం :** దుక్కి దున్ని సాగు చేయు పద్ధతిలో పొడి విత్తనాలను నేలపై వెదజల్లడం ద్వారా కాని, వెద సాగు యంత్రం (విత్తన గొర్రు) సహాయంతో గాని సాగు చేయవచ్చు. ఈ పద్ధతిలో పొడి విత్తనాన్ని వాడతారు.

దమ్ము చేసి సాగు చేయు పద్ధతిలో మొలకెత్తిన విత్తనాలను దమ్ము చేసిన పొలాల్లో వెదజల్లడం ద్వారా లేదా డ్రమ్ సీడరు ద్వారా విత్తుకోవచ్చు.

ఆరు తడి వరి సాగు



దమ్ములో డ్రమ్ సీడర్ తో వరి సాగు



**దమ్ములో వెదజల్లె పద్ధతిలో వరి సాగు**



బంక నేలల్లో దమ్ము చేసిన మరుసటి రోజు వెదజల్లి విత్తుకోవచ్చు. విత్తే సమయంలో బురద పదును ఉంటే చాలు. కానీ ఇసుక శాతం ఎక్కువగా ఉన్నట్లయితే విత్తనం వేసే రోజే దమ్ము చేసి, చదును చేసి పలుచని నీటి పొర ఉండేటట్లు చూసుకుని విత్తుకోవాలి. మొలకెత్తిన విత్తనం ముక్కు బయటకు రాగానే 8 సాళ్ళ డ్రమ్ సీడర్‌తో నీరు పూర్తిగా తీసి వేసి బురద పదునులో విత్తుకోవచ్చు.

**కలుపు యాజమాన్యం :** వెదజల్లు సాగులో సరియైన సమయంలో కలుపు నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యం. దుక్కి దున్ని విత్తిన 48 గంటల లోపు తేమ ఉన్నప్పుడు ఎకరాకు 1 లీ. పెండిమిథాలిన్ 30% (స్టాంప్, పెండిస్టార్) లేదా 400 మి.లీ. ప్రిటిలాక్లోర్ 50% (రిఫిట్, ఎరేజ్) 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

దమ్ము చేసి వెదజల్లు పద్ధతిలో వరి విత్తిన 3 నుండి 5 రోజులలోపు పొలంలో నీరు పలుచగా ఉన్నప్పుడు ఎకరానికి 35 నుండి 50 గ్రా. ఆక్సాడయార్జిల్ 80% (టాప్ స్టార్) లేదా 80 గ్రా. పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 10% (సాధి) మందులలో ఏదో ఒక దానిని ముందుగా అర లీటరు నీటిలో కలుపుకుని ఆ ద్రావణాన్ని ఎకరానికి 20 కిలోల పొడి ఇసుకలో కలిపి సమంగా చల్లాలి. ఈ మందు చల్లిన 2-3 రోజుల వరకు పొలంలో నీరు బయటకు పోనిచ్చుట కాని లేదా బయట నీరు పొలంలోకి పెట్టుట కాని చేయరాదు.

ఏ కారణం చేతనైన పైన తెలిపిన సమయాల్లో కలుపు మందు వేయలేనప్పుడు విత్తిన 15-20 రోజుల మధ్య ఈ క్రింద తెలిపిన కలుపు మందులు పిచికారి చేసుకోవలెను.

**విత్తిన 15-20 రోజుల మధ్య :** ఊద మొదలగు గడ్డి జాతి మొక్కలు ఎక్కువగా ఉంటే ఎకరాకు 400 మి.లీ. సైహలోఫాప్ బ్యుటైల్ 10% (క్లించర్, రాప్ అప్) 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి లేదా గడ్డి జాతి మరియు వెడల్పాకు మొక్కలు ఎక్కువగా ఉంటే ఎకరాకు 100 మి.లీ. బిస్‌పైరిబాక్ సోడియం 10% (నామినిగోల్డ్, తారక్, అడోరా) 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

విత్తిన నెల రోజుల తర్వాత పొలంలో వెడల్పాకు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరానికి 400 గ్రా. 2,4 డి సోడియం సాల్టు 80% (ఫెర్నాక్సోన్, గ్రీనోక్సోన్, క్లీన్ 80, సాలిక్స్) 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఈ మందు పిచికారి చేసినప్పుడు పైరు కొంచెం ఎర్రబడును కనుక నత్రజని ఎరువును పైపాటుగా వేసుకోవాలి లేదా ఎకరానికి 50 గ్రా. ఇథాక్సి సల్ఫ్యూరాన్ (సన్ రైస్) పొడి మందు లేదా మెట్‌సల్ఫ్యూరాన్ మిథైల్ + క్లోరిమ్యూరాన్ ఇథైల్ 20% (ఆల్‌మిక్స్) ఎకరానికి 8 గ్రా. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

విత్తిన 40-45 రోజుల మధ్య ఒకసారి మనుషులతో కలుపు తీయుట వలన వేరు వ్యవస్థ కదిలి పిలక తొడుగుతుంది.

గొర్రుతో వేసిన లేదా డ్రమ్ సీడర్‌తో వేసినప్పుడు వరుసల మధ్య కోనో వీడర్‌తో కలుపును చేలో కలియదున్నవచ్చు.

**మొక్కలు లేనిచోట కొత్త మొక్కలు (మనీదలు) వేసుకొనుట :** వెదజల్లు పద్ధతి సాగు చేయు రైతులు విత్తే రోజే ఎకరానికి అరసెంటు నారు మడి పోసుకున్నట్లయితే అధిక వర్షాలు వలన లేదా పల్లపు ప్రాంతాలలో మొక్కలు చనిపోయి ఖాళీలు ఏర్పడిన ప్రాంతాలలో ఈ నారును ఉపయోగించి మనీదలు వేయుట వలన కావల్సిన మొక్కల సాంద్రత ఉంటుంది. అలాగే ఒత్తుగా ఉన్న మొక్కలు తగ్గి పలుచగా ఉన్న ప్రాంతాలలో నాటుకోవచ్చు. విత్తిన 21 రోజులకు మనీదలు వేసుకుంటే మంచిది. ఒక వేళ నారు లేని పక్షంలో పిలకలను చీల్చి నాటి ఎరువుల యాజమాన్యం చేయవచ్చు. చాలా మంది రైతులు వేరే రకం నారు వేయుట వలన ఆ తర్వాత పైరులో కలువక ధాన్యం కొనుగోలులో ఇబ్బంది పడుతుంటారు.

**ఎరువుల యాజమాన్యం :** సార్వాకి ఎకరానికి 36:24:24 నత్రజని, భాస్వరం, పొటాష్ నిచ్చు ఎరువులను వేసుకోవాలి. నాట్లు వేసే పద్ధతిలో లాగానే సిఫారసు చేసిన పూర్తి భాస్వరాన్ని మరియు సగం పొటాష్ ఎరువును ఆఖరి దమ్ములో వేసి కలియదున్నాలి. మిగిలిన సగం పొటాష్ ఎరువును అంకురం దశలో వేయాలి. సిఫారసు చేసిన నత్రజని ఎరువులను విత్తిన 15 రోజులకు, రెండో దఫా పిలకలు కట్టే దశ, ఆఖరి దఫా చిరుపొట్ట దశలో వేసుకోవాలి. నత్రజని ఎరువును దమ్ములో గాని దుక్కిలో గాని వేస్తే కలుపు సమస్య ఎక్కువ అవుతుంది.

**నీటి యాజమాన్యం :** విత్తిన తరువాత మొక్కల మొదటి ఆకు పూర్తిగా విచ్చుకునే వరకు (సుమారు 7-10 రోజులు) ఆరుతడులు ఇవ్వాలి. ఈ సమయంలో అకాల వర్షాలు వలన పంట నీట మునిగితే నీరు బయటకు పోవుటకు చిన్న కాలువలు చేసుకోవాలి. మొక్కలు 4-5 ఆకులు తొడిగిన తర్వాత పిలకల దశలో ఒక అంగుళం మేర నీరు ఉంచాలి, చిరుపొట్ట దశ నుండి పూత దశ వరకు 2 అంగుళాలు నీరు ఉంచాలి. గింజ గట్టి పడే దశలో బురద పదునుపై ఉంచాలి.

**సస్యరక్షణ చర్యలు :** నాట్లు పద్ధతిలో లాగే పురుగు ఉధృతిని గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

**సేంద్రీయ పద్ధతిలో నేరుగా వరి విత్తే పద్ధతిలో సాగు చేయుటకు:** రైతులు ఒక కిలో విత్తనానికి సూడోమోనాస్ 10 గ్రా. పట్టించి నీడలో ఆరబెట్టాలి. ఆ తర్వాత అజోస్పైరిల్లమ్ మరియు ఫాస్ఫోబాక్టీరియా 10 గ్రా. లేదా 10 మి.లీ. ఒక కిలో విత్తనానికి పట్టించి నీడలో ఆరబెట్టినా 6-8 గంటలలోపు విత్తనాన్ని వెదజల్లుకోవాలి.

కలుపు మనుషులతో తీసుకోవాలి లేదా కోనోవీడర్‌తో కలియదున్నాలి. పచ్చి రొట్ట, పశువుల ఎరువు, జీవన ఎరువులు, వేపపిండి ఎరువుల యాజమాన్యానికి వాడుకోవాలి.

**చివరగా నేరుగా వరి విత్తి సాగు పద్ధతిలో చేయవలసిన పనులు మరియు చేయకూడని పనులు గమనిద్దాం :**

**చేయవలసిన పనులు :**

- పడిపోని రకాలు సాగుకు ఎంపిక చేసుకొనుట.
- చేను చదును చేసుకుని ప్రతి 2 మీటర్లకు కాలువలు తీయుట.
- సరియైన సమయంలో కలుపు మందులు అనగా దుక్కి దున్ని వెదజల్లే పద్ధతిలో విత్తిన 48 గంటల లోపు, దమ్ము చేసి వెదజల్లితే విత్తిన 3 నుండి 5 రోజులలోపు, విత్తిన 15-20 రోజులకు, విత్తన నెల రోజులకు వాడుకోవాలి.
- ఎరువులు విత్తిన 15 రోజులకు, పిలకల దశ, అంకురం దశలో వాడుట.
- చేనును కోతకు వారం - 10 రోజుల ముందు మాత్రమే ఎండగట్టాలి.

**చేయకూడని పనులు :**

- ఎక్కువ మోతాదులో విత్తనం వాడటం.
- పడిపోయే రకాలు సాగు చేయటం.
- ముంపు మరియు చౌడు భూములలో సాగు చేయటం.
- అధిక మోతాదులో ఎరువులు వాడటం వలన చేలు పడిపోతాయి.
- కలుపు మందులు వాడినప్పుడు భూమిలో తేమ లేకపోవుట.
- చేలు చదును చేసుకోకుండా మరియు నీరు బయటకు తీయటానికి కాలువలు చేసుకోకపోవటం.

పై విషయాలను రైతులు నేరుగా వరి విత్తి సాగు పద్ధతిలో పాటించినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెం : **94901 95904**

# వివిధ పంటలలో జీవ శిలీంద్రాల వాడకం ద్వారా నేల ద్వారా సంక్రమించే తెగుళ్ళ సమర్ధ నివారణ - రైతుల అభిప్రాయాలు

డా॥ జి. ప్రసాద్ బాబు, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం); డా॥ ఎన్. రమేశ్ నాయక్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ కె. లక్ష్మణ్, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి; డా॥ యం. రవీంద్రా రెడ్డి, శాస్త్రవేత్త (సూక్ష్మ జీవశాస్త్రం); ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి మరియు డా॥ టి. శ్రీనివాస్, కార్యక్రమ సమన్వయ కర్త, కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి.

**వా**ణిజ్య పంటలలో నేల ద్వారా సంక్రమించే వేరు కుళ్ళు, కాండం కుళ్ళు, మొదలు కుళ్ళు మరియు వడలు తెగులు ప్రధానమైన సమస్యలు. వీటి నివారణపై రైతులకు అవగాహన లేమి వలన, అనేక రకాల రసాయనాలను పిచికారి చేయడం వల్ల తెగుళ్ళ నివారణ అవకపోగా దిగుబడి తగ్గడం జరుగుతూ వుంది.

ఈ సమస్యను అధిగమించడానికి కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి వారు జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి నుండి జీవ శిలీంద్ర నాశినులైన ట్రైకోడెర్మా విరిడి మరియు సూడోమోనాస్ లను అలాగే జీవన ఎరువులైన అజటో బాక్టర్, పి.ఎస్.బి. మరియు అజోస్పైరిల్లమ్ లను తెప్పించి రైతుల పొలాల్లో ప్రదర్శనా క్షేత్రాలు నిర్వహించడం జరిగింది. ఇందులో ఒక కిలో చొప్పున ట్రైకోడెర్మా విరిడి మరియు సుడోమోనాస్ జీవ శిలీంద్ర నాసినులను 100 కిలోల పేడ ఎరువు మరియు 200 కిలోల



మిరపలో వడలు తెగులు

వేప చెక్కతో కలిపి ఆ మిశ్రమాన్ని నీడలో 15 రోజుల పాటు గోనె సంచులు కప్పి నీళ్ళు చల్లి మగ్గిన తర్వాత నేలలో తేమ వున్నపుడు ఒక ఎకరం పొలంలో సమానంగా వెదజల్లడం జరిగింది. దీని వలన ఈ జీవ శిలింద్రాలు నేలలో అభివృద్ధి



జీవ శిలీంద్ర నాశినిని పొలంలో వేయుట

చెంది వాటి సంతతిని పెంచుకొని సహజసిద్దంగా వడలు తెగులు, వేరుకుళ్ళు, మొదలు కుళ్ళు తెగుళ్ళను కలుగజేసే శిలీంద్రాలు నివారించబడ్డాయి. దీని ఫలితంగా మిరప, ఉల్లి, ప్రత్తి పంటలలో అధిక దిగుబడులు, నికర ఆదాయం పెరిగింది. గత 4 సంవత్సరాలలో దాదాపు 100 క్వింటాళ్ళ జీవన ఎరువులను, జీవ శిలీంద్ర నాశినులను 675 మంది రైతులకు అందివ్వడం జరిగింది.

**రైతుల అభిప్రాయాలు :**

**శ్రీ.బిలేకల్ గోవిందు, హెచ్.మురవని గ్రామం, పెద్దకడుబూరు మండలం, కర్నూలు జిల్లా, మొబైల్ నెం. 94404 47983**

నేను గత 10 సంవత్సరాలుగా మిరప, ఉల్లి, కూరగాయలు మరియు పత్తి పంటల్ని పండించడం జరుగుతూ వుంది. జీవశిలీంధ్ర నాసినులపై అవగాహన లేకుండా ఎక్కువగా రసాయనాలపై ఆధారపడటం వల్ల 10% ఖర్చు పెరగడమే కాకుండా 15-26% దిగుబడులు కూడా తగ్గేవి. దీని నివారణకు కె.వి.కె. లో అందుబాటులో వున్న జీవశిలీంద్ర నాసినులైన ట్రైకోడెర్మా విరిడి & సుడోమొనాస్ తెచ్చుకొని గత రెండు సంవత్సరాలుగా వాడడం జరిగింగి. దీనివల్ల దాదాపు 80 నుండి 90 శాతం భూమిద్వారా సంక్రమించే తెగుళ్ళు అయినటువంటి వడలు తెగులు, మొదలుకుళ్ళు, వేరుకుళ్ళు, కాండంకుళ్ళు వంటి తెగుళ్ల నివారించబడ్డాయి. అలాగే రసాయనాలపై ఖర్చు కూడా ఏకరాకు రూ. 3250/- తగ్గి దిగుబడులు పెరిగి నికర ఆదాయం ఎకరాకు రూ. 8300/- పెరగడం జరిగింది.

**శ్రీ.బి.గోవిందరాజులు / కౌతాలం గ్రామం మరియు మండలం, కర్నూలు జిల్లా, మొబైల్ నెం. 94416 57785**

నేను గత 4 సంవత్సరాలుగా మిరప పంట పండిస్తున్నాను. మిరపలో వడలు తెగులు (విల్ట్) వల్ల 25% మొక్కలు చనిపోవడం జరుగుతూ వుండేది. ఎన్ని రసాయన మందులు వాడినా ఫలితం లేకపోయేది. వాట్సాప్ గ్రూపులో కె.వి.కె. వారు పంపిన సూచనల ప్రకారం వారి వద్దే 2 కిలోల చొప్పున ట్రైకోడెర్మా మరియు సూడోమోనాస్ లను కొని 100 కిలోల పేడ ఎరువు మరియు 200 కిలోల వేపచెక్క కలిపి నేలలో చల్లుకోవడం జరిగింది. దీనితోపాటు రైజోబియం & పి.ఎస్.బి. వంటి జీవన ఎరువులను కూడా వాడడం జరిగింది. దీని ఫలితంగా దాదాపు మొక్కలు చనిపోయే సమస్య 80 నుండి 90 శాతం తగ్గింది. అలాగే రసాయనాల మీద పెట్టే ఖర్చు ఏకరాకు రూ. 5000/- తగ్గి దిగుబడి కూడా ఏకరాకు 125 కిలోలు అధికంగా తీసి రూ. 12,500/- అధికంగా నికర ఆదాయాన్ని పొందాను.

**జి.రామాంజినేయులు, కులుమాల గ్రామం, గోనెగండ్ల మండలం, కర్నూలు జిల్లా, మొబైల్ నెం.9492404256**

నేను గత 5 సంవత్సరాలుగా వేరుశనగ పంటను పండిస్తున్నాను. ఈ పంటలో మొదలు కుళ్ళు, కాండం కుళ్ళు, వేరుకుళ్ళు తెగుళ్ళు ఎక్కువగా ఆశించేవి. వీటి నివారణకు ఎన్ని మందులు కొట్టినా ఫలితం లేకపోగా సాగు ఖర్చు పెరిగిపోయింది. వ్యవసాయ శాఖ సలహాల మేరకు నేను కృషి విజ్ఞాన కేంద్రంను సంప్రదించి నాణ్యమైన జీవ శిలింద్రాలను తెచ్చి పేడ ఎరువు కలిపి పొలంలో చల్లుకొన్నాను. దీని ద్వారా దాదాపు 75 నుండి 95 శాతం తెగుళ్లను నివారించుకోగలిగాను. అలాగే పెట్టుబడి ఖర్చు ఎకరాకు రూ. 3250/- తగ్గి దిగుబడి 135 కిలోలు పెరిగి రూ. 4750/- అధిక నికర ఆదాయం సంపాదించాను.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : **74163 84968**

---

**వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురంకు ఉత్తమ మెట్ట వ్యవసాయ పరిశోధనా స్థాన పురస్కారం**

కేంద్రీయ మెట్ట పరిశోధనా స్థానం (క్రీడా), హైదరాబాదులో జూన్ 2-4, 2022 వరకు భారతదేశంలోని 31 ప్రదేశాల్లో అఖిల భారత మెట్ట వ్యవసాయ పరిశోధనా పథకంలో భాగంగా జరిగిన పరిశోధనా ఫలితాలను విశ్లేషించారు. ఇందులో భాగంగా భారతదేశంలోని 31 అఖిల భారత మెట్ట వ్యవసాయ పరిశోధనా స్థానాల్లో, వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురంకు ఉత్తమ పరిశోధనా స్థానం పురస్కారాన్ని : ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, న్యూఢిల్లీ-డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా॥ ఎస్.కె. చౌదరి, కేంద్రియ మెట్ట పరిశోధనా స్థానం డైరెక్టర్ డా॥ వి.కె. సింగ్ మరియు అఖిల భారత మెట్ట వ్యవసాయ పరిశోధనా సథకం జాతీయ సమన్వయ కర్త డా॥ జి. రవీంద్రాచారి గారి చేతుల మీదుగా వ్యవసాయ పరిశోధనా స్థానం, ప్రధాన శాస్త్రవేత్త & అధిపతి డా॥ బి. సహదేవ రెడ్డి గారు స్వీకరించారు.

# మెట్టసాగులో పాటించవలసిన నేల మరియు నీటి సంరక్షణా పద్ధతులు

డా॥ ఎ. మల్లీశ్వర రెడ్డి, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); డా॥ బి. సహదేవ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (మెట్ట వ్యవసాయం) & అధిపతి; డా॥ కె.అశోక్ కుమార్, సీనియర్ శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం) మరియు డా॥ కె.వి.యస్. సుధీర్, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); వ్యవసాయ పరిశోధనా స్థానం, అనంతపురము.

**ఆ**ంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మొత్తం 67.19 లక్షల హెక్టార్ల సాగు భూమిలో, సుమారు 39.11 లక్షల హెక్టార్ల (58.2 శాతం) భూమి వర్షాధారంగా సాగులో ఉంది. ఇందులో ఎక్కువ భాగం ఎర్ర గరప నేలలు, చల్కా నేలలు మరియు నల్ల రేగడి నేలల్లో సాగు అవుతున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏప్రిల్, 2022 నుండి 13 కొత్త జిల్లాలను ప్రారంబించడం ద్వారా, రాష్ట్రంలో ప్రస్తుతం 26 జిల్లాలు ఏర్పడ్డాయి. మన రాష్ట్రంలో ఉన్న వివిధ జిల్లాల వర్షపాతం యొక్క దీర్ఘ సగటు (1988 నుండి 2014) ను పరిశీలించడం ద్వారా ఏవేవి వర్షాధారంగా సాగు చేస్తున్నారో తెలుసుకోవచ్చు. ఆంధ్ర రాష్ట్రంలో వర్షాధారంగా సాగు చేసే ప్రాంతాలు ఎక్కువగా అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, వై.యస్.ఆర్, అన్నమయ్య, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, తిరుపతి మరియు చిత్తూరు జిల్లాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేలో వర్షాధార ప్రాంతం ఎక్కువగా ఉన్న 11 జిల్లాల్లోని 335 మండలాల్లో 16 మండలాల్లో (5 శాతం) సగటు వర్షపాతం 500 మి.మీ. కంటే తక్కువ, 172 మండలాల్లో (51 శాతం) సగటు వర్షపాతం 500-700 మి.మీ. గాను, 106 మండలాల్లో (32 శాతం) సగటు వర్షపాతం 750-1000 మి.మీ. గాను, 41 మండలాల్లో (12 శాతం) సగటు వర్షపాతం 1000 మి.మీ. గాను నమోదు అవుతున్నది.

మన రాష్ట్రంలో 75 శాతం వర్షపాతం నైరుతి ఋతు పవనాల మీద ఆధారపడి ఉంటుంది. మెట్ట వ్యవసాయంలో ముఖ్యంగా వాతావరణ మరియు నేల సమస్యల వలన పంటల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. వర్షాధార ఎర్ర నేలల్లో

**పట్టిక : ఆంధ్రప్రదేశ్ లోని వివిధ జిల్లాల్లో వర్షపాతం ఆధారంగా మండలాల వర్గీకరణ :**

| జిల్లా | సరాసరి (మి.మీ.) | < 500 | 500-750 | 750-1000 | > 1000 | మొత్తం మండలాలు |
|---|---|---|---|---|---|---|
| శ్రీ సత్యసాయి | 596 | 3 | 29 | - | - | 32 |
| అనంతపురము | 525 | 11 | 20 | - | - | 31 |
| కర్నూలు | 627 | - | 25 | - | - | 25 |
| నంద్యాల | 747 | - | 18 | 11 | - | 29 |
| చిత్తూరు | 856.3 | 0 | 4 | 22 | 4 | 30 |
| తిరుపతి | 1043.8 | 0 | 2 | 7 | 24 | 33 |
| వై.యస్.ఆర్.కడప | 658.8 | 1 | 29 | 3 | 1 | 34 |
| అన్నమయ్య | 727.1 | 0 | 18 | 11 | 1 | 30 |
| ప్రకాశం | 781 | 1 | 16 | 19 | 2 | 38 |
| బాపట్ల | 928 | - | 2 | 15 | 8 | 25 |
| పల్నాడు | 805 | - | 9 | 18 | 1 | 28 |
| | మొత్తం | 16 | 172 | 106 | 41 | 365 |



వర్షపు నీరు వృధాగా పోవడం

ముఖ్య సమస్యలు ఏవనగా: లోతు తక్కువ, భూసారం తక్కువగా ఉండటం, సేంద్రీయ కర్బనం తక్కువగా ఉండటం, భూమి లోపల గట్టి పొర ఉండి, నీటిని ఇంకించే గుణం తక్కువగా ఉండటం. అలాగే, ముఖ్య వాతావరణ సమస్యలు ఏవనగా: తక్కువ వర్షపాతం, ఋతుపవనాలు ముందుగా రావడం, త్వరగా నిష్క్రమించడం, ఆలస్యంగా రావడం, అనిశ్చిత వర్షపాతం నమోదు అవడం, పంట కాలంలో దీర్ఘకాలిక బెట్ట పరిస్థితులు రావడం, ఒక్కొక్కసారి అధిక వర్షపాతం వారం రోజుల వరకు వరుసగా ఎడతెరపి లేకుండా అధిక తీవ్రతతో వర్షం కురవడం సంభవిస్తూ ఉంటుంది. మన రాష్ట్రంలో కురిసే వర్షపాతంలో దాదాపు 40 శాతం వరకు వర్షపు నీరు భూమి లోనికి ఇంకి పోవడం, ఒరవడి రూపంలో పొలం బయటకు వృధాగా పోతుంది. కేవలం 10 శాతం వరకు మాత్రమే భూమిలో పట్టి ఉంచబడి, పంటలు సద్వినియోగ పరుచుకోవడం జరుగుతుంది. ఈ వర్షపు నీరు పొలం బయటికి కొట్టుకొనిపోవడం వలన వర్షపు నీటి వృధాతో పాటు సారవంతమైన భూమి పై ఉన్న పొర కొట్టుకొని పోవడం వలన పోషకాల నష్టంతో పాటు నేల మృత్తికా క్రమక్షయం జరుగుతుంది. కావున, కొద్ది సంవత్సరాలలోనే భూమిలో ఉత్పాదకత శక్తి తగ్గి, పంట దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగ పరుచుకొని, భూమి కోతకు గురి కాకుండా పంట దిగుబడులు పెంచుకోవాలి.

### నేల మరియు నీటి సంరక్షణా పద్ధతులు :

- సారవంతమైన పై మట్టి వివిధ రూపాలలో నష్టపోవటాన్ని నేలకోత అంటారు. ఇది సాధారణంగా నీరు మరియు గాలి ద్వారా జరుగుతుంది. మెట్ట సేద్యంలో నేల సంరక్షణా మరియు ఆధునిక మెట్ట వ్యవసాయ సాగు పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులను పొందవచ్చు.
- లోతు తక్కువ గల ఎర్ర గరప నేలల్లోను, భూమి లోపల గట్టి పొర (మొర్రం) ఉన్న నేలల్లోను లోతుగా దుక్కి చేయడం వలన చాలా ఉపయోగంగా ఉంటుంది. లోతు దుక్కికి ఇనుప



రెక్క నాగలి

నాగలి కానీ, డిస్క్ నాగలి కానీ, రెక్క నాగలితో గానీ ట్రాక్టరుకు తగిలించి సుమారు 30 సెం.మీ. లోతు వరకు దుక్కి చేయవచ్చు. ఈ లోతు దుక్కి వలన భూమిలో గట్టి పొర పగిలి నేల బాగా గుల్లబారుతుంది. పంట వేర్లు భూమి లోపలి పొరల్లోకి పెరిగి, ఎక్కువ నీటిని, పోషకాలను గ్రహించడానికి వీలవుతుంది. ఒకవేళ పంట కాలంలో వర్షాభావ పరిస్థితులు వచ్చినప్పటికీ పంట త్వరగా బెట్టకు గురి కాదు. లోతు దుక్కి ప్రభావం కనీసం మూడు సంవత్సరాల వరకు ఉంటుంది.

- ప్రతి 2 సంవత్సరాల కొకసారి, నేల స్వభావాన్ని బట్టి ప్రతి 1 మీ. లేదా 2 మీ. లకు చిజిల్ నాగలితో (సబ్ సాయిలర్) సుమారు 45-60 సెం.మీ. వరకు లోతుగా దున్నడం ద్వారా భూమిలో గట్టి పొర పగిలి నేల బాగా గుల్ల బారుతుంది. తద్వారా ఎక్కువ వర్షపు నీరు భూమి లోనికి ఇంకి పోతుంది. ముఖ్యంగా దీర్ఘ కాలిక మరియు లోతైన వేరు వ్యవస్థ గల



సబ్ సాయిలర్

కంది, ఆముదం వంటి మెట్ట పంటల్లో ఈ పద్ధతి మంచి ఫలితాన్ని ఇస్తుంది.

- వాలుకు అడ్డంగా దున్నడం, విత్తడం మరియు అంతర కృషి చేయడం వలన వర్షపు నీరు వాలుతలంలో పరుగెత్తి వృధాగా

పోకుండా సుమారు 10 శాతం నీటి ప్రవాహ వేగం తగ్గి భూమిలోనికి ఇంకి పోవడానికి అవకాశం కలుగుతుంది. నీటి ప్రవాహ వేగం తగ్గడం వలన భూమి కోతకు గురి కాకుండా ఉంటుంది.

- సుమారు రెండు శాతం వాలు కలిగిన ఎర్ర నేలల్లో ప్రతి 50 మీటర్ల దూరానికి 0.63 ఘ.మీ. పరిమాణంలో కాంటూరు గట్లు వేసుకోవాలి.
- వర్షాధార మెట్ట భూముల్లో, భూమిపైన గుబురుగా పెరిగి నేలకోతను నిరోధించే పంటలైన వేరుశనగ, అలసంద, పెసర, మినుము, ఉలవ లాంటి పంటలను ఒక పీలికగా మరియు నేల కోతను అనుమతించే పంటలైన కంది, సజ్జ, ఆముదం లాంటి పంటలను మరొక పీలికగా అంతర పంటలుగా సాగు చేసుకోవాలి. దీని వలన పడిన వర్షపు నీరు భూమిలోనికి ఎక్కువగా ఇంకుతుంది మరియు నేల కోతకు గురి కావడం కూడా నిరోధించ బడుతుంది. అంతేగాక, భూసారం వృద్ధి చెంది, అధిక దిగుబడులతో పాటు, పంట ప్రకృతి వైపరీత్యాలకు గురైనపుడు కనీస దిగుబడిని మరియు ఆదాయాన్ని పొందవచ్చు.
- వేరుశనగలో అంతర పంటగా కందిని వేసేటప్పుడు కందితో పాటు నీటి ఒరవడిని అరికట్టే పంటలైన ఉలవ, అలసంద కలిపి విత్తితే, ఒరవడి అరికట్టడమే కాకుండా, నేల కోతను తగ్గించి, అధిక నికర ఆదాయం పొందవచ్చు.
- ఎర్ర గరప నేలలు మరియు ఇసుక నేలల్లో బంక మట్టి శాతం తక్కువగా ఉన్నందువలన, పడిన వర్షపు నీరు ఎక్కువ లోతులో ఇంకి పోతుంది. ఈ చెరువు మట్టిని మెట్ట భూముల్లో తోలుకోవడం వలన భూమిలో నీరు నిల్వ ఉంచుకొనే సామర్థ్యం పెరుగుతుంది. అంతే గాకుండా, చెరువు మట్టిలో ఉండే సేంద్రీయ కర్బనం, ఇతర స్థూల మరియు సూక్ష్మ పోషకాలు కూడా మొక్కలకు లభిస్తాయి. అంతే గాకుండా, భూమి యొక్క భౌతిక లక్షణాలు కూడా మెరుగుపడతాయి.
- సేంద్రీయ పదార్థము పెంచడము, పశువుల ఎరువు వేయడం, గొర్రెలు మంద కట్టడము, పంటల అవశేషాలు వేయడం ద్వారా నేలలో తేమ ఎక్కువ కాలం నిలువ ఉండేలా చేసుకోవచ్చు.
- ప్రతి 5 సంవత్సరాల కొకసారి బెలుకు (షేల్స్) ను ఒక హెక్టారుకు సుమారు 300 టన్నులు పొలాలకు మల్చింగ్ (ఆచ్ఛాదన) లాగా తోలుకోవడం వలన, నేల లోపలి పొరల్లో తేమ సంరక్షింపబడి, బెట్ట పరిస్థితుల్లో కూడా వర్షాధార పంటల్లో దిగుబడి పెరుగుతుంది.
- మెట్ట భూముల్లో వాలుకు అడ్డంగా గట్లపైన మొక్కలు నాటడాన్ని జీవగట్లు అంటారు. సాధారణంగా దట్టంగా పెరిగి వర్షపు నీటిని ఆపే శక్తి గల గడ్డి జాతి మొక్కలను జీవగట్లుగా వేస్తారు. వట్టి వేరు గడ్డి, కలబంద, కిత్తనార వంటి మొక్కలు వేసుకోవచ్చు. ఈ గడ్డి జాతి మొక్కలు నీటి ప్రవాహాన్ని తగ్గించి , నీరు భూమిలోనికి ఇంకేటట్లు చేస్తాయి. ఈ జీవగట్లు 1 నుంచి 3 అడుగుల వెడల్పులో దగ్గర దగ్గరగా వాలుకు అడ్డంగా వేసుకోవాలి. దీని వలన వర్షపు నీటి ప్రవాహ వేగం తగ్గి నేల కోతకు గురి కాదు.



మల్చింగ్ (పంట అవశేషాలు వేయడం)

- లోతు తక్కువ గల ఎర్ర గరప నేలల్లో పంట మొలకెత్తిన 20-25 రోజుల తర్వాత ప్రతి రెండు సాళ్ళ మధ్య కట్టె నాగలి గానీ లేదా బోదె నాగలి గానీ నడిపినట్లు అయితే పొలమంతా బోదెలు-కాలువలు లాగా తయారు అవుతాయి. బోదెలు చేయడం వలన మొక్కల మొదళ్లకు తగినంత మట్టి సమకూరుతుంది. ఇలా బోదెలు-కాలువలు చేయడం వలన వర్షపు నీరు సాళ్లలో నిలబడి భూమి లోనికి ఇంకి పోతుంది, తద్వారా ఎక్కువ నీరు భూమిలోనికి ఇంకడం వలన భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండి పంట మొక్కలకు అందించడం వలన దిగుబడి పెరుగుతుంది.
- నల్ల రేగడి నేలలకు 0.8 ఘ.మీ. గ్రేడెడ్ గట్లు వేయాలి. ఈ గట్ల పై భాగాన 0.1-0.25 శాతం వాలుతో నీరు పోవడానికి కాలువ ఏర్పరిచి, ఈ కాలువలను పెద్ద కాలువలతో కలిపి, నేల కోత లేకుండా నీటిని బయటికి పోయేలా చూడాలి.
- నల్ల రేగడి నేలల్లో 5 మీ × 5 మీ. చతురస్రాకార గట్లను (కంపార్ట్ మెంటల్ బండింగ్) తొలకరి వర్షాలు ప్రారంభంలో చేసుకొనినచో, వర్షపు నీరు భూమిలోనికి ఇంకి తేమ శాతం ఎక్కువగా నిలువ ఉంటుంది. తర్వాత పప్పు శనగను అక్టోబర్/నవంబర్ మాసాల్లో విత్తినచో పంట దిగుబడులు పెరుగుతాయి.

- నల్లరేగడి నేలల్లో నేలను కాలువవల్లాగా తయారు చేసి, వెడల్పాటి బోదేలపైన విత్తుకోవాలి. ఈ కాలువలు ఎక్కువ నీటిని బయటికి పంపడానికి తోడ్పడతాయి. బోదెల ప్రక్కన కాలువలు తక్కువ వర్షం వచ్చినపుడు నీరు ఇంకడానికి, ఎక్కువ వర్షం వచ్చినపుడు నీరు బయటికి పోవడానికి ఉపయోగపడతాయి.
- మెట్ట ప్రాంతాల్లో 10 నుండి 30 రోజుల వరకు పంట కాలంలో వర్షాభావ పరిస్థితులు సాధారణంగా సంభవిస్తుంటాయి. ఒక్కోసారి వరుసగా ఎడ తెరపి లేకుండా వర్షం కురవడం వలన పొలం నుండి నీరు ఒరవడి రూపంలో ప్రవహిస్తుంది. ఈ విధంగా వృథాగా పోతున్న నీటిని నీటి గుంటల్లో నిల్వ చేసుకోవాలి. రైతులు తమ పొలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఈ నీటి కుంట (ఫారం పాండు)ను త్రవ్వుకోవాలి. నీటి కుంటలను 150-400 ఘ.మీ.పరిమాణంలో తయారు చేసుకోవచ్చు. సాధారణంగా వర్షాధారపు ఎర్ర నేలల్లో నీటి కుంటలు 10 మీ. పొడవు, 10 మీ. వెడల్పు, 2.5 మీ. లోతు (250 ఘ.మీ.) గా త్రవ్వుకోవాలి. నీటి కుంటల్లో వర్షపు నీరు నిల్వ ఉండడానికి 6 భాగాల మట్టి, 1 భాగం సిమెంటు కలిపి పూత పూయడం వలన సుమారు 2,50,000 లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చు. ఈ నీటిని, పంట కీలక దశల్లో బెట్ట వచ్చినపుడు సూక్ష్మ నీటి సాగు పద్ధతుల ద్వారా (తుంపర/బిందు సేద్యం) ఒక తడి (సుమారు 20 మి.మీ.) ఇచ్చినపుడు వివిధ మెట్ట పంటల్లో 20-30 శాతం దిగుబడి పెరుగుతుందని పరిశోధనలో తేలింది.



నీటికుంట


మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : **99892 08210**

**దూరదర్శన్ - ముఖాముఖి కార్యక్రమాల వివరాలు (సా. 6.00 నుండి 6.55 గం॥ వరకు)**

| తేది | అంశం | నిపుణులు | ఫోన్ నెంబర్లు |
|---|---|---|---|
| 04.07.2022 (సోమ వారం) | ఖరీఫ్ కాలానికి అనువైన పంటల వారిగా అధిక దిగుబడులు ఇచ్చే రకాలు | **డా॥ ఏ. సుబ్బరామి రెడ్డి,** సంచాలకులు (విత్తనాలు), పరిపాలనా భవనం, లాం, గుంటూరు జిల్లా. | 94402 20038 |
| 07.07.2022 (గురు వారం) | కర్ర పెండలంలో మేలైన యాజమాన్య రకాలు | **డా॥ యం. జానకి,** శాస్త్రవేత్త & అధిపతి, ఉద్యాన పరిశోధనా స్థానం, డా॥ వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం, పెద్దాపురం, కాకినాడ జిల్లా. | 73829 39063 |
| 11.07.2022 (సోమ వారం) | గొర్రెలు, మేకల పోషణలో మెళకువలు | **డా॥ బి. రంగమ్మ,** సహ ఆచార్యులు, పశువైద్య కళాశాల, ఎస్.వి.వి.యు. తిరుపతి. | 76619 78333 |
| 14.07.2022 (గురు వారం) | కృష్ణ మండలానికి అనువైన పంటల ప్రణాళిక | **డా॥ పి. రత్నప్రసాద్,** సహ పరిశోధన సంచాలకులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, గుంటూరు. | 99896 25210 |
| 18.07.2022 (సోమ వారం) | మునగాకు విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆరోగ్యం మరియు వ్యవస్థాపకత్వ అభివృద్ధి | **డా॥ బి. విజయశ్రీ, శాస్త్రవేత్త** (గృహ విజ్ఞాన శాస్త్రం), కృషి విజ్ఞాన కేంద్రం, వెంకటగిరి, తిరుపతి. | 95508 66706 |
| 25.07.2022 (సోమ వారం) | లాభసాటిగా వివిధ నూతన పద్ధతులలో వరి సాగు | **డా॥ టి. శ్రీనివాస్,** ప్రధాన శాస్త్రవేత్త (వరి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మారుటేరు, పశ్చిమ గోదావరి జిల్లా. | 93968 48380 |
| 28.07.2022 (గురు వారం) | మామిడిలో పాటించవలసిన ఎరువులు, కత్తిరింపులు మరియు యాజమాన్య పద్ధతులు | **డా॥ బి. విమల, శాస్త్రవేత్త,** (ఉద్యాన శాస్త్రం), ఉద్యాన పరిశోధనా స్థానం, అనంతపురం జిల్లా. | 94938 31009 |

# కర్రపెండలంలో మేలైన రకాలు మరియు నారుమడి యాజమాన్యం

డా॥ యం. జానకి, శాస్త్రవేత్త & అధిపతి, ఉద్యాన పరిశోధనా స్థానం, పెద్దాపురం.





పి.డి.పి. సి.యమ్.ఆర్. – 1



పి.డి.పి. – 9

కర్రపెండలం ఉష్ణమండలపు పంట. దీనికి అధిక తేమ, ఉష్ణోగ్రత గల వాతావరణం అనుకూలం. నీటి ఎద్దడిని బాగా తట్టుకుంటుంది. వర్షాధార పంట క్రింద జూన్–జూలై నెలల్లోను, నీటి పారుదల క్రింద అన్ని నెలల్లోను సాగు చేసుకోవచ్చును. తేలికపాటి ఇసుకతో కూడిన ఒండ్రు, ఎర్ర గరప నేలలు అనుకూలము. క్షార భూములు, మురుగు నీరు పోని బరువైన నేలలు పనికిరావు. ఉదజని సూచిక 5 నుండి 6 మధ్య వుంటే మంచిది.

**మేలైన రకాలు :** శ్రీ రక్ష, శ్రీ శక్తి, పి.డి.పి. సి.ఎం.ఆర్.–1 రకాలు అధిక దిగుబడిని కలిగి సమర్ధవంతంగా కసావా మొజాయిక్ తెగులును తట్టుకుంటాయి. శ్రీ అతూల్య, శ్రీ అపూర్వ, శ్రీ హర్ష రకాలు అధిక దిగుబడిని మరియు అధిక పిండి శాతాన్ని కలిగి వుంటాయి. అలానే శ్రీ జయ, శ్రీ విజయ, శ్రీ ప్రకాశ్, శ్రీ స్వర్ణ మరియు పి.డి.పి. – 9 రకాలు అధిక దిగుబడిని కలిగి, తక్కువ కాలపరిమితి గల రకాలు.

**ప్రవర్ధనం :** 7–10 నెలలు వయస్సు గల పక్వత చెందిన చీడపీడలు లేని మొక్కల నుండి కొమ్మలను విత్తన కర్రగా వాడాలి. కొమ్మ క్రింది మరియు చివర భాగాలను తొలగించి, మధ్య భాగాన్ని 20 సెం.మీ. పొడవు గల ముచ్చెలగా కోసి నాటుకోవాలి.

**నారుమడి :** ఎకరాకు సుమారుగా 4,938 ముచ్చెలు అవసరం. ఎకరాకు 1 మీటరు వెడల్పు, 2.5 మీ. పొడవు, 15 సెం.మీ. ఎత్తు కలిగిన రెండు నారుమడులు అవసరం. విత్తనము ముచ్చెలను లీటరు నీటికి 2 మి.లీ. డైమిథోయేట్ మరియు 3 గ్రా. మాంకోజెబ్ కలిపిన మందు ద్రావణంలో 5 నిమిషాలు ముంచి నారుమళ్ళలో దగ్గరగా పైపైన నాటాలి. అవసరాన్ని బట్టి రోజూ నీరు పోయాలి. 7 –

10 రోజుల్లో వేరు, చిగురు తొడిగి ముచ్చెలు నాటడానికి సిద్ధంగా తయారవుతాయి.



నారుమడి



మందు ద్రావణం



మందు ద్రావణంలో ముంచిన విత్తన ముచ్చెలు







వేరు, చిగురు తొడిగి నాటడానికి సిద్ధంగా ఉన్న ముచ్చెలు

**మినిసెట్ పద్ధతి :** విత్తన కర్ర తక్కువగా ఉన్నట్లయితే మినిసెట్ పద్ధతి ద్వారా విత్తన కర్రను 2 కణుపులు గల 2 సెం.మీ. ముక్కలుగా కత్తిరించుకొని నారుమడిలో 5 సెం.మీ. వరుసల దూరంలో నాటుకొనవలెను.




**నాటే విధానం :** ఆరోగ్యవంతమైన వేరు, చిగురు తొడిగిన ముచ్చెలను వరుసల మధ్య మొక్కల మధ్య 90×90 సెం.మీ. దూరంలో, 5 సెం.మీ. లోతుగా నాటుకోవాలి.



**నాటిన తరువాత జాగ్రత్తలు :** కసావా (కర్రపెండలం) మొజాయిక్ తెగులు సోకిన మొక్కలను వెంటనే తొలగించి, తగులబెట్టాలి. నాటిన 10-15 రోజుల్లో చనిపోయిన మొక్కల స్థానంలో 40 సెం.మీ. పొడవు గల వేరు తొడిగిన ముచ్చెలతో భర్తీ చేయాలి.



మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : **73829 39063**

# మామిడి తోటలలో కోత అనంతర సాగు యాజమాన్య పద్ధతులు

డా॥ జి. చిట్టిబాబు, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం); డా॥ డి. చిన్నం నాయుడు, కార్యక్రమ సమన్వయ కర్త మరియు
డా॥ ఎస్. నీలవేణి, శాస్త్రవేత్త (విస్తరణ), కృషి విజ్ఞాన కేంద్రం, ఆమదాలవలస.

**మా**మిడి సాగు విస్తీర్ణంలో మరియు ఉత్పత్తిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండవ స్థానంలో ఉన్నది. రాష్ట్రంలో దాదాపుగా 3.7 లక్షల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉంది. ప్రతి ఏడాది దాదాపు 28-30 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల రాష్ట్రంలో చాలా చోట్ల మామిడి పూత ఆలస్యంగా వచ్చి ఆకాల వర్షాల కారణంగా పంట నష్టం వాటిల్లడంతో ఈ ఏడాది దిగుబడి బాగా తగ్గింది. రాబోయే కాలంలో దిగుబడులు తగ్గకుండా, మామిడి రైతులు కోత తర్వాత సరైన యాజమాన్యం పాటించడం ద్వారా వచ్చే ఏడాది సక్రమంగా పూత రావడంతో పాటు, రైతులు అధిక దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుంది. మామిడి కోత అనంతరం అనగా జులై - ఆగష్టు నెలల్లో కొమ్మల కత్తిరింపులు, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యంతో పాటుగా అవసరానికి అనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడిని పొందడానికి అవకాశం ఉంటుంది.

**విశ్రాంతి సమయం :**

విపరీతమైన ఎండల కారణంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు, పండ్ల ద్వారా తమ శక్తిని విపరీతంగా కోల్పోవడం వల్ల, మామిడి పంట కోత అనంతరం చెట్లు చాలా బలహీనంగా పెరుగుదల లేకుండా కొన్ని రోజుల పాటు నిద్రావస్థలో ఉంటాయి. కాబట్టి మామిడి కాయలు కోసిన తర్వాత సుమారు 15-20 రోజుల వరకూ తోటలో ఎలాంటి పనులు చేయకుండా చెట్లకు విశ్రాంతి ఇవ్వాలి. చెట్లు బలం పుంజుకునేందుకు నీటి తడులు ఇస్తే మంచిది. నీటిని సమృద్ధిగా ఇవ్వడం ద్వారా చెట్లు కోలుకుంటాయి.

**కొమ్మ కత్తిరింపులు :**

- తగిన విశ్రాంతి సమయం అనంతరం ఎండిన, అడ్డంగా పెరిగిన నేలబారుగా ఉన్న కొమ్మలను తీసివేయాలి అలాగే కాపు కాసిన కొమ్మలను ఒక కణుపు వెనకకు కత్తిరించాలి.
- చెట్టు ఆకారం విప్పారిన గొడుగులా ఉన్నట్లయితే, సూర్యరశ్మి, గాలి ప్రసరణ బాగా ఉండి, పూత మరియు కాపు బాగుంటాయి. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్యరశ్మి, గాలి లోపలికి ప్రసరించే విధంగా తల పైన 3-4 అంగుళాల మందం ఉన్న కొమ్మలను కోసి వాటి మధ్య ఖాళీ ఏర్పరచాలి.
- ఈవిధంగా కత్తిరింపులు చేయడం వల్ల మధ్యాహ్నం సమయంలో ఎండ చెట్టు మొదళ్ళ మీద పడుతుంది. అవసరమైతే తూర్పు - పడమర దిశల్లో కూడా రెండు మూడు అంగుళాల మందం ఉన్న కొమ్మలను కత్తిరించి బొమ్మల మధ్యలో ఖాళీ ఏర్పడేలా చేసినట్లయితే సూర్యుడు తూర్పున ప్రయాణించేటప్పుడు ఖాళీ ప్రదేశాల గుండా లోపలికి ప్రసరిస్తుంది.
- ఈ కత్తిరింపులు కొమ్మలు ఆకులు ఎక్కువగా ఉండే రకాలైన ఆల్ఫాన్సా, బంగినపల్లి, నీలం వంటి రకాలకు తప్పనిసరిగా చెయ్యాలి. కొమ్మ కత్తిరింపులు ప్రూనింగ్ సా, ప్రూనింగ్ సికేచర్, ప్రూనింగ్ నైఫ్ వంటి పరికరాలతో మాత్రమే చేయాలి.
- సాధారణ కత్తులు వాడి కొమ్మలను అడ్డదిడ్డంగా నరికితే కొమ్మలు పగుళ్ళు ఏర్పడి, తెగుళ్ళ బారిన పడే అవకాశం ఉంది. పై నుంచి కింద వరకు కత్తిరించిన తరువాత కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టుగా చేసి పూత పూయాలి. అవసరమైతే మళ్ళీ కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. ఒక లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని చెట్లపై పిచికారి చేయాలి.
- అలాగే కత్తిరింపులు అనంతరం చెట్లు బలం పుంజుకోవడానికి 10 గ్రా. యూరియా మరియు 5 గ్రా. జింక్ సల్ఫేట్ కలిపి పిచికారి చేసినట్లయితే త్వరగా కోలుకొని కొత్త చిగురులు పెడతాయి.
- ఈవిధంగా కొమ్మలను ప్రతి సంవత్సరం కత్తిరింపులు చేయడం వల్ల క్రమం తప్పకుండా కాపు నిలకడగా వస్తుంది అంతేగాక మరియు వెలుతురు సక్రమంగా అందడం వల్ల వివిధ చీడపీడలు తెగుళ్ళు ఆశించకుండా నివారించబడతాయి.

## సేద్య పనులు మరియు ఎరువులు వాడకం :

- తొలకరి వర్షాలు పడిన తర్వాత తోటల్లో వాలుకు అడ్డంగా చెట్ల మధ్యన రెండు మూడు సార్లు దున్నాలి. దీని వల్ల వర్షపు నీరు ఇంకిపోయి పురుగు యొక్క గుడ్లు మరియు కోశస్థ దశలు సూర్యరశ్మి తగిలి చనిపోతాయి.
- మామిడి కొమ్మ కత్తిరింపుల అనంతరం ప్రతి సంవత్సరం సేంద్రీయ మరియు రసాయన ఎరువులను తప్పనిసరిగా వేసి దిగుబడిని పెంచవచ్చు. తోటను దున్నే సమయంలో ఎకరాకు 4-5 టన్నుల పశువుల ఎరువు 200 కిలోల చెట్ల మధ్య చల్లుకొని కలియదున్నాలి.
- చెట్ల మధ్య దున్నకం పూర్తయిన తరువాత చెట్టు వయస్సుని బట్టి ఎరువుల మోతాదును రెండు సమ భాగాలుగా చేసి కొమ్మ కత్తిరింపులు చేసిన తరువాత ఒకసారి మరియు కాయ గింజ పరిమాణంలో ఉన్నప్పుడు ఒకసారి వేయాలి.
- ఎరువుల మోతాదును ఒక సంవత్సరం వయసున్న చెట్టుకు 25 కిలోల పశువుల ఎరువు, 217 గ్రా. యూరియా, 625 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ మరియు 167 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున వేయాలి. 5 సంవత్సరముల వయస్సు ఉన్న చెట్టుకు 50 కిలోల పశువుల ఎరువు, ఒక కిలో యూరియా, 3 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ అలాగే ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున వేయాలి.
- 10 లేదా అంతకంటే ఎక్కువ వయసున్న చెట్టుకు 60 నుంచి 70 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల యూరియా, 6 కిలోల సూపర్ ఫాస్ఫేట్ మరియు 1670 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. కొత్తగా చిగురులు వేసే సమయంలో అంటే సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో సూక్ష్మపోషక మిశ్రమాలైన ఫార్ములా 4 లేదా స్పెషల్ వంటి వాటిని 5 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- మొదటి దఫా ఎరువులు వేసిన అనంతరం తదుపరి చెట్ల మధ్య ఖాళీ స్థలంలో జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను చల్లి పచ్చిరొట్ట పూత దశకు చేరుకున్నాక తోటలో కలియదున్నడం వల్ల సేంద్రీయ కర్బనం మరియు ఇతర పోషకాల లభ్యత పెరుగుతుంది. పచ్చిరొట్టను దున్నే సమయంలో ప్రతి చెట్టుకు 500 గ్రా. జింక్ సల్ఫేటు, 500 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్, 100 గ్రా. బోరాన్ వేసి కలియదున్నడం వల్ల మామిడిలో పూత అధికంగా రావడానికి ఆస్కారం ఉంటుంది.

## సస్యరక్షణ పద్ధతులు :

- మామిడి కాయల కోత తర్వాత సాధారణంగా కాండం తొలిచే పురుగు, బెరడు తొలిచే పురుగు ఆకులపై బుడిపెలు చేసే పురుగు ఆశించి నష్టపరుస్తాయి.
- ఈ దశలో మామిడి చెట్లను చాలా మంది రైతులు పట్టించుకోక నిర్లక్ష్యం చేస్తుంటారు. అందువల్ల పురుగులు ఉధృతి ఎక్కువగా అవ్వడం వలన మొక్కలు బలహీన పడతాయి.
- మామిడి తోటలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఈ పురుగుల తీవ్రతను తగ్గించుకోవచ్చు. కాండం తొలిచే పురుగు ఆశించే భాగాలను శుభ్రం చేసి అవసరమైతే వాటిని జాగ్రత్తగా కత్తిరించి నాశనం చేయాలి.
- కాండం కొమ్మలపైన పురుగులు చేసిన రంధ్రాలలో డైక్లోరోవాస్ మందు ద్రావణం లీటరు నీటికి 10 మి.లీ. చొప్పున కలిపి దూదిలో ముంచి పురుగు చేసిన రంధ్రాలలో ఉంచి మట్టితో కప్పి ఉంచాలి. దీని వలన లోపల ఉన్న పురుగులు చనిపోతాయి.
- ఆకు గూడు పురుగులు, ఆకుపై బుడిపె చేసే పురుగులు, ఆకు చుట్టు పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.0 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మామిడిలో కాండంపై గాయాలు అవడం వల్ల బంక కారు తెగులు, కొమ్మలపై నల్లగట్టు తెగులు ఎక్కువ శాతం నష్టపరుస్తాయి.
- ఈ తెగులు ఆశించిన కొమ్మలను కత్తిరించి నాశనం చేయాలి మిగిలిన కొమ్మల్లో బంక, నల్ల కట్టను గోనె సంచి గుడ్డతో రుద్ది శుభ్రపరిచి, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి తెగుళ్ళ వ్యాప్తికి నివారించవచ్చు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 98490 35068

# వర్షాకాలంలో - కోళ్ళ యాజమాన్యం

డా॥ సి. అనిల్ కుమార్, సహ ఆచార్యులు (పశువుల పోషణ శాస్త్రం); డా॥ టి. సుస్మిత, సహ ఆచార్యులు (కోళ్ళ పెంపక శాస్త్రం) లైవ్ స్టాక్ ఫార్మ్ కాంప్లెక్స్, డా॥ ఎన్.టి.ఆర్. పశువైద్య కళాశాల, గన్నవరం.

**కో**ళ్ల పెంపకందారులు వాతావరణ పరిస్థితుల్లో మార్పును గమనిస్తూ, తదనుగుణంగా యాజమాన్య పద్ధతులలో మార్పులు చేసుకున్నట్లయితే ఉత్పాదకత పెంచుకోవచ్చు. వర్షాకాలంలో కోళ్ళ రైతు మరింత జాగ్రత్తగా ఉండాలి మరియు కోళ్ల పెంపకం పట్ల తన పూర్తి దృష్టిని కేంద్రీకరించాలి. ఋతుపవనాలు ప్రధానంగా ఉష్ణోగ్రత మరియు వాతావరణ పరిస్థితుల మార్పుల కారణంగా ఉత్పత్తి ప్రభావితం అవుతుంది. పక్షుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే, వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. వర్షాకాలంలో టార్పాలిన్ కవర్లతో కప్పబడిన సైడ్ వాల్ల నుండి నీటి ప్రవాహం అనేక వ్యాధి కారకాల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది మరియు లిట్టర్ యొక్క తేమకు కారణమవుతుంది. ఈ వ్యాధి కారకాల వలన కోళ్లలో వచ్చే అనేక వ్యాధులలో, ఫౌల్‌పాక్స్ చాలా పెద్ద అంటువ్యాధి మరియు కోడి ఆరోగ్యాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. ఐ.బి.డి.ఎక్కువగా సోకే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధి కోడి యొక్క రోగ నిరోధక వ్యవస్థ యొక్క బర్సల్ భాగాన్ని లక్ష్యంగా చేసుకుంటుంది, ఇది రోగ నిరోధక శక్తిని క్షీణింప చేసి మరియు ద్వితీయ అంటురోగాలకు గురి చేస్తుంది.

వర్షం నుండి నీరు కలుషితమై అనేక పురుగులు మరియు పరాన్నజీవులను తెస్తుంది. కాబట్టి, వర్షాకాలంలో అంతర పరాన్న జీవుల సంక్రమణను నివారించడానికి కోళ్లకు నులి పురుగులు నివారణ చర్యలు (డి-వర్మింగ్) చేపట్టడం చాలా అవసరం. వర్షాకాలం లిట్టరులో తేమ స్థాయిని పెంచుతుంది. కాబట్టి, పొడిగా వుండే విధంగా వరి పొట్టు సిద్ధంగా ఉంచుకోవాలి. ప్రవేశ ద్వారం మీద చూరు (పైకప్పు) కట్టడం (ఓవర్ హాంగ్స్) చాల వరకు వర్షపు నీరు ప్రవేశ ద్వారం నుండి రాకుండా ఆపుతుంది.

వీలైనంత వరకు కోళ్లను పొడిగా ఉంచినట్లయితే కోళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. సైడ్ వాల్స్ / గోడలు నుండి నీరు లీక్ అవ్వకుండా చూసుకోవడానికి, కప్పుకు సరైన చూరు ను జోడించవచ్చు. ఈ నిర్మాణంతో లీకేజ్ అయ్యే నీటిని నివారించ వచ్చు. సరి అయిన వెలుతురు ఏర్పాట్ల (వెంటిలేషన్) ద్వారా గాలి బాగా తిరిగేటట్లు చూసుకోవాలి. ముందస్తుగా వర్షాకాలంలో ప్రబలే వ్యాధులు దృష్టిలో ఉంచుకొని టీకాలు వేయడం ముఖ్యం. వర్షాకాలం కోడి యొక్క రోగ నిరోధక శక్తి తగ్గే అవకాశం ఉంటుంది. అవి బాక్టీరియా మరియు వైరస్‌ల ద్వారా సులభంగా సంక్రమించవచ్చు. ఈ సీజన్‌లో బాగా పెరిగే దోమలు మరియు



ఇతర రక్తం పీల్చే కీటకాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు, వీటి ద్వారా కోళ్లకు వైరస్‌లు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

పైకప్పు లేదా గోడలలో ఏవైనా లీక్‌లు ఉన్నాయో లేదో తనిఖీ చేయాలి మరియు మరమత్తులు (రిపేర్) చేయాలి. ఈదురు గాలులు అధికంగా వున్నపుడు ఫీడర్‌ను వర్షపు జల్లు నుండి రక్షించడానికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలం ముందు మురుగు నీటి పారుదల (డ్రైనేజీ) వ్యవస్థలు సరిగ్గా పని చేస్తున్నాయో లేదో చూసుకోవాలి. షెడ్ల దగ్గర నీరు నిలిచిపోవడం వల్ల పరాన్నజీవులు పెరిగే అవకాశం ఉంటుంది. వర్షపు నీరు లోపల పడడం వలన షెడ్ లోపల తేమ ఎక్కువ అవ్వడం వలన అమ్మోనియా స్థాయిని పెంచుతుంది. అంతేకాకుండా, బ్రూడింగ్ కొరకు ఉపయోగించే బొగ్గు కోడి పిల్లలకు హానికరం కాబట్టి, షెడ్‌లోకి వర్షపు నీరు రాకుండా పక్క అడ్డ తెరలు (కర్టెన్ల)ను గట్టిగా మూసి ఉంచాలి. అమ్మోనియా మరియు ఇతర అనవసర వాయువులను బయటకు వెళ్ళడానికి వీలుగా పగటిపూట పక్క గోడల అడ్డ తెరల (సైడ్ కర్టెన్) పై భాగంలో 1-2 అడుగులు ఎప్పుడూ తెరచి ఉంచాలి.

వర్షాకాలంలో ఈగల నియంత్రణకు లార్వా నియంత్రణ కీలకం, తడి లిట్టరు (కోడి పెంట పోగు) లార్వా పెరగడానికి సరైన వాతావరణం. సరైన రక్షణ లేనప్పుడు ఈ లార్వాలతో వున్నా తడి లిట్టరు వలస పక్షులను ఆకర్షిస్తుంది. రక్షణగా దిగువ మెష్ (జల్లెడ) గోడను ఉపయోగించడం వల్ల వలస పక్షుల ప్రవేశాన్ని నిరోధించవచ్చు. వలస పక్షి సంపర్కాన్ని నివారించడం వలన బర్డ్ ఫ్లూ వంటి వ్యాధులను నివారించవచ్చు.

దాణా పదార్థాలు తేమ తగలని ప్రదేశాలలో /

పరిస్థితులలో ఉంచాలి. తేమ స్థాయి పెరిగినపుడు ఫీడ్ (దాణా)లో కొన్ని రకాల బూజు (మైకోటాక్సిన్) కలుషితాల ప్రమాదాన్ని పెంచుతుంది. షెడ్ లోపల దాణా యంత్రాలు (ఫీడ్ మిల్లు), దాణా తొట్టెలు (ఫీడ్ బిన్) మరియు దాణా పాత్రలను (ఫీడర్లు) తేమ తగలని ప్రదేశాలలో ఉండేలా చూసుకోవాలి. దాణా మరియు దాణా పదార్థాలు వాతావరణంతో ప్రత్యక్ష సంబంధం లేకుండా గదుల (స్లాట్ల)లో నిల్వ చేయాలి.

వర్షాకాలంలో అధిక ఉష్ణోగ్రత మరియు తేమ కారణంగా ఇ. కోలి అనే బాక్టీరియా నీటి ద్వారా వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీని వలన కోళ్ళలో అంటువ్యాధులు పెరుగుతాయి. కలుషితమైన నీటి వనరులు కూడా రోగాల వ్యాప్తికి కారణమవుతాయి, కాబట్టి క్రమం తప్పకుండా నీటి పరిశుభ్రతను నిర్వహించడం చాలా అవసరం. పైప్‌లైన్‌లను పూర్తిగా శుభ్రపరచుకోవాలి. ఈ కాలంలో ఫాగర్ వినియోగం నిలిపి వేయటం మంచిది. స్థానిక పంట పెరుగుదల ఫలితంగా వర్షాకాలంలో ఎలుకల కార్యకలాపాలు పెరుగుతాయి. ఎలుకలు షెడ్ల చుట్టూ పెరగడం వ్యాధి వ్యాప్తికి దారితీస్తుంది. ఈ కాలంలో కఠినమైన ఎలుకల నియంత్రణ చర్యలు అమలు చేయాలి మరియు కోళ్ళ గృహం (పౌల్ట్రీ హౌస్) మరియు పొలానికి దగ్గరగా ఉన్న చెట్లు లేదా కలుపు మొక్కలను క్రమం తప్పకుండా కొమ్మలు షెడ్ల మీద పడకుండా ఉండేటట్లు చూసుకోవాలి.

వర్షాకాలంలో పగటి కాలం/నిడివి తక్కువగాఉంటుంది. పెరుగుతున్న దశలో ఉన్న కోళ్లను వెలుతురు లేనట్లయితే ఎదుగుదల తగ్గుతుంది. వెలుతురు మరియు వెచ్చగా ఉంచడానికి ఉపయోగించే బల్బులను తరచుగా శుభ్రం చేయాలి.

అధిక తేమ కారణంగా ఫీడర్‌లో దాణా ఉండలు కట్టటం వలన కొన్ని రకాల బూజు శిలీంధ్రాలు (మైకోటాక్సిన్స్) ఏర్పడవచ్చు, ఇవి కోళ్ళ మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఫీడర్ నుండి పాత మరియు ఉండలు కట్టిన దాణాను క్రమం తప్పకుండా తొలగించాలి.

దాణాలో టాక్సిన్ బైండర్‌లను చేర్చడం చాల ముఖ్యం. నీరు సరఫరా చేసే పైపుల లీకుల వలన, త్రాగేటప్పుడు నీరు కింద పడటం వలన, అధిక స్థాయిలో ఉప్పు మరియు కొన్నిసార్లు అధిక ప్రోటీన్ మరియు అధిక పీచు పదార్థం ఆహారంలో ఉండటం వాళ్ళ లిట్టరు మరింత తడిగా మారె ప్రమాదం వుంది.

లిట్టరును తాజా పొడి పొట్టు లేక పొడి లిట్టరు పదార్థాలలో కలపడం వల్ల లిట్టర్‌లోని తేమ స్థాయిలను తగ్గించవచ్చు. లిట్టర్‌లో తేమ స్థాయి మరీ ఎక్కువ వున్నట్లైతే, నేల విస్తీర్ణంలో ప్రతి పది చదరపు మీటర్లకు ఒక కిలోగ్రాము (1 కిలో) చొప్పున సున్నం (లైమ్ వాష్) పొడి చల్లుకోవాలి. ముందుగా వున్నా తడిచిన లిట్టరును కలియ బెట్టాలి. లిట్టరును తగినంత మందంగా (కనీసం 10 – 15 సెం.మీ.) చల్లుకోవాలి. సున్నం క్రిమి సంహారకంగా కూడా పనిచేస్తుంది, లిట్టరులో ఉండే కాక్సిడియల్ గుడ్లను పేగు పురుగుల గుడ్లు మరియు ఇతర సూక్ష్మక్రిములను నాశనం చేయడానికి ఇది ఎంతో సహాయ పడుతుంది.

వాతావరణం చల్లగా ఉన్నప్పుడు కోళ్ళు దాణా తినే అలవాట్లలో మార్పు చేసుకుంటాయి. ఈ కాలంలో కోళ్లకు అధిక శక్తితో కూడిన ఆహారం ఇవ్వాల్సి ఉంటుంది. వర్షాకాలంలో, కోళ్లకు శక్తి అవసరాలను తీర్చడానికి, అధిక కొవ్వులు కలిగిన ఆహారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది.

కోళ్ళు తమ పాత ఈకలను రాల్చి కొత్త ఈకలు రావడాన్ని మోల్టింగ్ అంటారు. ఈ ప్రక్రియ ప్రతి సంవత్సరం పగటి కాలం తక్కువగా ఉన్నప్పుడు, చల్లని ఉష్ణోగ్రతలలో జరుగుతుంది. ఈ కాలంలో వాటి పోషక నిల్వను నిర్మించడానికి ఉపయోగించుకుంటుంది. కావున, కోళ్లకు అధిక నాణ్యత కల్గిన ఆహారం ఇవ్వాలి. కోళ్ళు సులభంగా శరీర ఉష్ణోగ్రత త్వరగా కోల్పోతాయి కాబట్టి వర్షాకాలంలో కోడిపిల్లలను రక్షించడానికి తగిన పొదుగు (బ్రూడింగ్) సౌకర్యం కల్పించాలి. కోడిపిల్లలు బాగా తినడానికి వీలుగా పొదుగు గృహం (బ్రూడర్ హౌస్) ఉష్ణోగ్రత తగినంత విధంగా ఉండేటట్లు చూసుకోవాలి.

వర్షాకాలంలో అనేక కోళ్ళ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి, ముఖ్యంగా ఇన్ఫెక్షియస్ బర్సల్ డిసీజ్ (గుంబోరో), ఫౌల్ పాక్స్, ఫౌల్ కలరా, ఇ–కోలి మరియు సాల్మోనెల్లా. వీటిని నివారించడానికి షెడ్‌ను ఎప్పుడూ పొడిగా ఉండేలా చూసు కోవాలి, ఉండలు కట్టిన దాణాని ఆపివేయాలి. కోళ్ల రోగనిరోధక శక్తిని పెంచడానికి వర్షాకాలంలో రోజూ హెర్బల్ యాంటీ బయోటిక్స్ ఇవ్వాలి.

పెంట పోగు (డీప్ లిట్టరు) వ్యవస్థలో కోళ్ళు నేలను గీరడం కారణంగా, నేల మరియు ఎరువు కోళ్ల గోళ్లు మరియు వాటి కాలి చివరల చేరి కోడి నడకను ప్రభావితం చేస్తాయి, కొన్ని సార్లు వైకల్యం కూడా కలిగే అవకాశం వుంది. కావున, కోళ్ళ షెడ్ యొక్క నేల ఎల్లప్పుడూ పొడిగా ఉండేట్లు చూసుకోవాలి.

కోళ్ళ రైతులు వర్షాకాలంలో చాల జాగ్రత్తగా ఉండాలి. కోళ్ళ పాక (ఫారమ్)లో వర్షాకాలంలో వ్యాధి సంభవించే తీరు, అనారోగ్యం మరియు మరణాల రేటును ఎక్కువగా నిర్వహణ పద్ధతి నిర్ణయిస్తుంది. అందువల్ల, వర్షాకాలంలో కోళ్ళ రైతులు పరిశుభ్రమైన నిర్వహణ పద్ధతులను మరియు సకాలంలో టీకాలు వేయించినట్లయితే కోళ్ళ మరణాలను తగ్గించుకోని ఉత్పత్తిని పెంచుకోవచ్చు.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : 80089 35550

# వ్యవసాయ విద్య విస్తృత వ్యాప్తికి సార్వత్రిక మరియు దూర విద్యా కేంద్రం కోర్సులు

డా॥ కె.ఎస్. పూర్ణిమ, సహాయ ఆచార్యులు (విస్తరణ శాస్త్రం); ఎ.ఎన్.జి.ఆర్.ఎ.యు., డా॥ ఎ. లలిత, సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం); డా॥ ఎమ్. వెంకటరాములు, సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం) మరియు డా॥ ఎ. మనోజ్, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం); వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, లాం, గుంటూరు.

మన దేశంలో ప్రధాన జీవనోపాధి అందిస్తున్న వ్యవసాయ రంగం ప్రస్తుత తరుణంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ రైతులకు మరియు సంబంధిత సంస్థలకు సవాలుగా మారింది. వీటిని ధైర్యంగా ఎదుర్కొని సమర్థవంతంగా పరిష్కరించు కోవాలంటే మారుతున్న కాలానికి మరియు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విద్యను అందిస్తున్న విద్యాసంస్థలు మరియు విశ్వవిద్యాలయాలు తమ విద్యా ప్రణాళికలలో కొన్ని మార్పులు చేయవలసిన అవసరం ఉంది. 100 శాతం అక్షరాస్యత సాధించే ఉద్దేశంతో మన భారత ప్రభుత్వం దేశ వ్యాప్తంగా దూరవిద్యను ప్రోత్సహించి ప్రతి ఒక్కరికి విద్యను అందుబాటు లోకి తీసుకొనివచ్చేందుకు కృషి చేస్తుంది. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్యతను పెంచు కోవడం ఎంతో అవసరం. ఇందుకు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలలో విద్యతో పాటుగా క్షేత్రాలలో శిక్షణలు, ప్రదర్శనలు, సందర్శనలు మరియు అనేక కార్యక్రమాలు చేపట్టి ఈ లక్ష్యాన్ని చేరుకుంటున్నది. వ్యవసాయ విద్యను వివిధ వర్గాలలో అనగా రైతులు, మహిళలు, యువకులు, మరెంతో మంది ఆసక్తిగల వారికి అందించే ఉద్దేశంతో దూరవిద్య మార్గాన్ని కూడా అనుసరించి సార్వత్రిక మరియు దూరవిద్యా కేంద్రాన్ని ప్రారంభించింది.

విద్యాలయాలలో, కళాశాలలో మరియు శిక్షణా కేంద్రాలలో వ్యవసాయ విద్యను అందుకోలేకపోతున్న ఎంతో మంది రైతులు, రైతు మహిళలు, గ్రామీణ యువత, విస్తరణ అధికారులు అలాగే వ్యవసాయములో నైపుణ్యత మరియు

**విశ్వవిద్యాలయ దూరవిద్య కేంద్రం ద్వారా ప్రారంభముకానున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు**

| సం. | సర్టిఫికెట్ కోర్సు | వ్యవధి | ఫీజు | తేది |
|---|---|---|---|---|
| 1. | సేంద్రియ వ్యవసాయం | 8 వారాలు | 1,500/- | జులై - సెప్టెంబరు, 2022 |
| 2. | మిద్దె తోటల పెంపకం | 8 వారాలు | 1,500/- | సెప్టెంబరు - నవంబరు, 2022 |
| 3. | తేనెటీగల పెంపకం | 8 వారాలు | 1,500/- | జులై - సెప్టెంబరు, 2022 |
| 4. | పుట్టగొడుగుల పెంపకం | 8 వారాలు | 1,500/- | సెప్టెంబరు - నవంబరు, 2022 |
| 5. | చిరుధాన్యాలు | 8 వారాలు | 1,500/- | సెప్టెంబరు - నవంబరు, 2022 |
| 6. | వర్మి కంపోస్టు మరియు సేంద్రీయ ద్రావణాలు, కషాయలు. | 8 వారాలు | 1,500/- | అక్టోబరు - డిసెంబరు, 2022 |
| 7. | పట్టు పురుగుల పెంపకం | 8 వారాలు | 1,500/- | అక్టోబరు - డిసెంబరు, 2022 |
| 8. | జీవన ఎరువులు | 8 వారాలు | 1,500/- | జనవరి - మార్చి, 2023 |

సామర్థ్యాన్ని పెంపొందించు కోవాలనుకుంటున్న వారందరికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ కేంద్రము ద్వారా అందుకొనే గొప్ప అవకాశం.

- సాంకేతిక మరియు వ్యవస్థాపక నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి కల్పించడం.
- కళాశాలలో వ్యవసాయ విద్యను అందుకోలేకపోతున్న ఎంతో మంది గ్రామీణ పేదలకు విద్యా అవకాశాలు కల్పించి వ్యవసాయ పరిజ్ఞానాన్ని విస్తృతంగా వ్యాపింపచేయడం.
- నూతన మాధ్యమాలు ఉపయోగించి దూరవిద్య ద్వారా వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడం.
- రాష్ట్ర రైతాంగానికి వ్యవసాయ సమాచారాన్ని మరియు సాంకేతికతను పంచుకొని అభివృద్ధి చెందే అవకాశం కల్పించడం.

**నియమ నిబంధనలు :**

- సర్టిఫికెట్ కోర్సులు 8 వారాల (2 నెలలు) వ్యవధిలో నిర్వహించబడును.
- తెలుగు రాసి మరియు చదవగలిగిన వారు రూ. 1,500/- ఫీజు చెల్లించి కోర్సుకు నమోదు కాగలరు. వయసు పరిమితి లేదు.
- నమోదు చేసుకొన్న అభ్యర్థులకు ఆన్‌లైన్ సదుపాయం (కంప్యూటర్ / ఆండ్రాయిడ్ ఫోన్) కలిగి ఉండాలి.
- కోర్సులో భాగంగా 6 ఆన్‌లైన్ క్లాసులతో పాటు ఎంపిక చేసుకున్న అధ్యయన కేంద్రాలలో అనుభవ పూర్వక మరియు ప్రయోగ పూర్వక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడును.
- నమోదు అయినవారు ప్రతి వారంలో ఒక రోజు ఆన్‌లైన్ క్లాసులకు హాజరు కాగలరు. ఒక్కో తరగతి (క్లాసు) 2-3 గంటలు నిర్వహించబడును. కోర్సులో చివరి వారం ఒక పరీక్ష నిర్వహించబడును.
- ఆన్‌లైన్ క్లాసులకు 100% హాజరు తప్పనిసరిగా ఉండవలెను.
- పాఠ్య ప్రణాళిక పుస్తకం ఇవ్వబడును.
- నమోదు కొరకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించి నమోదు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకొని, పత్రాన్ని పూర్తిచేసి, డి.డి. లేదా మనిఆర్డర్‌తో పాటు సార్వత్రిక మరియు దూరవిద్య కేంద్రం, గుంటూరుకు పంపగలరు.
- ఆన్‌లైన్ క్లాస్‌లో క్విజ్‌లు, ఎసైన్‌మెంట్‌లు నిర్వహించి కోర్సు పూర్తి అయిన తరువాత పరీక్ష నిర్వహించబడును. 50% మార్కులు పొందిన వారికి సర్టిఫికెట్ ఇవ్వబడును.

**నమోదు :**

- ఆసక్తి గలవారు వ్యవసాయ విశ్వవిద్యాలయ వెబ్ సైట్‌ను (www.angrau.ac.in) ను సందర్శించి నమోదు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తివివరాలు నింపి ఫీజ్‌తో పాటు మా కేంద్రానికి పంపవలెను.
- నమోదు చేసుకోవాలనుకుంటున్న వారు **రూ. 1,500/-** డి..డి లేదా మనిఆర్డర్‌ను Open And Distance Learning Centre, ANGRAU పేరిట గుంటూరులో చెల్లే విధంగా తీసి నమోదు పత్రంతో పాటుగా ఈ క్రింద తెలిపిన చిరునామాకు పంపగలరు.

**ఆన్‌లైన్ పేమెంట్ వివరాలు :**

Union Bank of India
A/c No : 031410100093292
IFSC Code : UBIN0803146
Branch : Koritipadu, Guntur.

**మా చిరునామా**

**సార్వత్రిక మరియు దూరవిద్యా కేంద్రం**

**(ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సెంటర్)**

వ్యవసాయ పీఠాధిపతి (వ్యవసాయం) కార్యాలయం,
పరిపాలనా భవనము,
ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం
లాం, గుంటూరు - 522 034.

**మరిన్ని వివరాలకు మా విశ్వవిద్యాలయ వెబ్ సైట్**
www.angrau.ac.in (లేదా)
మీ జిల్లా కృషి విజాన కేంద్రాన్ని (లేదా) సార్వత్రిక మరియు దూరవిద్యా కేంద్రం, గుంటూరు.
ఫోన్. నెం. 80087 88776 ను సంప్రదించండి.

## ఆంగ్రూ మరియు సహస్ర క్రాప్ సైన్సు ప్రైవేటు లిమిటెడ్ అవగాహనా ఒప్పంద కార్యక్రమం

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం గుంటూరు లోని పాలక వర్గ సమావేశ మందిరం నందు తేది 28.05.2022 న సహస్ర క్రాప్ సైన్సు ప్రైవేటు లిమిటెడ్ మరియు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహనా ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన్ రెడ్డి గారు, రిజిస్ట్రార్ డా॥ టి. గిరిధర కృష్ణ, వ్యవసాయ పీఠాధిపతి డా॥ ఏ. ప్రతాప్ కుమార్ రెడ్డి, పరిశోధనా సంచాలకులు డా॥ ఎల్. ప్రశాంతి, విద్యార్థి కార్యకలాపాల పీఠాధిపతి డా॥ ఎం. మార్టిన్ లూథర్, ఉన్నత విద్యా పీఠాధిపతి డా॥ జి. రామారావు, పరీక్షల నియంత్రణాధికారి డా॥ పి. సుధాకర్ మరియు సహస్ర క్రాప్ సైన్సు ప్రైవేటు లిమిటెడ్ నుండి డా॥ యన్. శ్రీరామ రెడ్డి గారు, సంచాలకులు (సాంకేతిక), ఎస్. చంద్రమోహన్ మరియు ఇతర సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

## ఆంగ్రూ మరియు జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ అవగాహన ఒప్పంద కార్యక్రమం

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, ఆడిటోరియం నందు తేది 29.05.2022 న విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన్ రెడ్డి గారి సమీక్షంలో జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ ముఖ్య సంచాలకులు డా॥ పి. చంద్రశేఖర మరియు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ టి. గిరిధర కృష్ణల నడుమ అవగాహన ఒప్పంద పత్రాల మార్పిడి జరిగింది. జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ ముఖ్య సంచాలకులు డా॥ పి. చంద్రశేఖర గారు, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి విస్తరణ సంచాలకులుగా, వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా, విస్తరణ విద్యా సంస్థ, హైదరాబాద్ ప్రిన్సిపాల్‌గా తాను అందించిన సేవల ద్వారా మరియు తాను రచించిన విస్తరణ విద్య అనే పాఠ్య గ్రంథం ద్వారా పేరు తెచ్చిన డా॥ ఏ. అడివి రెడ్డి గారి సంస్మరణార్థం నిర్వహించబడిన మొదటి ఉపన్యాసాన్ని వ్యవసాయ విస్తరణను పునరుత్తేజింప చేయడం చర్యలకు గల అవకాశాలు అనే అంశంపై ఉపన్యసించారు. ఈ కార్యక్రమము నందు వ్యవసాయ విశ్వవిద్యాలయము నుండి విస్తరణ సంచాలకులు డా॥ పి. రాంబాబు, విశ్వవిద్యాలయ వ్యవసాయ విస్తరణ విభాగాధిపతి డా॥ బి. విజయాభినందన గారు, రిజిస్ట్రార్ డా॥ టి. గిరిధర కృష్ణ, విశ్వవిద్యాలయ అధికారులు మరియు సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయ 52 మరియు 53 వ వార్షిక స్నాతకోత్సవం

ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ 52 మరియు 53 వ వార్షిక స్నాతకోత్సవంను జూన్ 8 వ తేదిన యస్.వి. వ్యవసాయ కళాశాల, తిరుపతి నందు నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మరియు వ్యవసాయ విశ్వవిద్యాలయ కులపతి మాననీయ బిశ్వభూషణ్ హరిచందన్ గారు ముఖ్య అతిథిగా పాల్గొని స్నాతకోపన్యాసం చేసారు. ఈ సాత్నకోత్సవంలో విశిష్ఠ అతిథిగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మరియు సహకారం, మార్కెటింగ్, ఆహార శుద్ధి శాఖామాత్యులు శ్రీ కె. గోవర్ధన రెడ్డి గారు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆహార భద్రత, పంట ఉత్పాదకత, రైతు ఆదాయం పెంపే లక్ష్యంగా విజ్ఞానం అందించాలని గవర్నర్ మరియు కులపతి బిశ్వభూషణ్ హరిచందన్ గారు సూచించారు.

వ్యవసాయ శాఖామాత్యులు శ్రీ కె. గోవర్ధన రెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ పట్టాలు పొందిన విద్యార్థులందరూ రైతులకు సేవ చేయుటకు సిద్ధంగా ఉండాలన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డా॥ ఏ. విష్ణువర్ధన రెడ్డి గారు విశ్వవిద్యాలయం ప్రగతి నివేదికను చదివి వినిపించారు.

ఈ స్నాతకోత్సవంలో 2018-19, 2019-20 విద్యా సంవత్సరంలో వ్యవసాయ విద్యలో డిగ్రీ, పీ.జీ., పి.హెచ్.డి. లలో ఉత్తీర్ణత సాధించిన 1963 మంది విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేసారు. ప్రతిభావంతులకు పసిడి పతకాలు, అధ్యాపకులు మరియు శాస్త్రవేత్తలకు పురస్కారాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు యం. గురుమూర్తి, గవర్నర్ కార్యలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, పాలక వర్గ సభ్యులు : డా॥ వి. చెంగా రెడ్డి, డా॥ సి.హెచ్. శ్రీనివాసరావు, డా॥ వి. శ్రీనివాసరావు, డా॥ జె. లక్ష్మీ, డా॥ ఎల్. విజయ భాస్కర రెడ్డి, పి.కె. సంజీవయ్య, శ్రీ టి.వి. మురళీనాధ రెడ్డి, శ్రీ యం. కస్తూరి, శ్రీ పి. దేవుళ్ళు, శ్రీ బి. శ్రీనివాసరావు, డా॥ పి. వెంకటముని రెడ్డి, శ్రీ సి. రామమోహన రెడ్డి, విశ్వవిద్యాలయ అధికారులు : రిజిస్ట్రార్ డా॥ టి. గిరిధర కృష్ణ, వ్యవసాయ పీఠాధిపతి డా॥ ఏ. ప్రతాప్ కుమార్ రెడ్డి, ఉన్నత విద్యా పీఠాధిపతి, డా॥ జి. రామారావు, వ్యవసాయ ఇంజనీరింగ్ మరియు సాంకేతికత పీఠాధిపతి మరియు వ్యయ నియంత్రణాధికారి డా॥ కె. ఎల్లా రెడ్డి, సహ పరిశోధనా సంచాలకులు డా॥ ఎల్. ప్రశాంతి, పరీక్షల నియంత్రణాధికారి డా॥ పి. సుధాకర్, సామాజిక విజ్ఞాన పీఠాధిపతి మరియు విశ్వవిద్యాలయ లైబ్రేరియన్ డా॥ సి.హెచ్. చిరంజీవి, శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా॥ ఆర్.పి. వాసంతి, ఆర్.ఎ.ఆర్.ఎస్. తిరుపతి, సహ పరిశోధనా సంచాలకులు డా॥ పి. రాజశేఖర్, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు - శాస్త్రవేత్తల సలహాలు

డా॥ ఏ. మనోజ్, శాస్త్రవేత్త (విస్తరణ)
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం, గుంటూరు - 522 034

**పార్వతి, పెదపాడు, వర్మకుంట, విశాఖపట్నం జిల్లా.**

**ప్ర. చౌడుని తట్టుకొని మేలైన దిగుబడిని ఇచ్చే వరి రకాలు తెలియ జేయండి ?**

**జ.** సోమశిల, నెల్లూరు మషూరి, నెల్లూరు ధాన్యరాశి, నెల్లూరు సుగంధ, యం.సి.యం. 100, యం.టి.యు. 1061.

**మురళి, పోతవరం, పామూరు, ప్రకాశం జిల్లా.**

**ప్ర. ప్రొద్దు తిరుగుడులో అధిక దిగుబడి ఇచ్చే రకాలు తెలియ జేయండి ?**

**జ.** ఎన్.డి.ఎస్.హెచ్. 1012, ఎల్.యస్.ఎఫ్.హెచ్. 171, డి.ఆర్.ఎస్.హెచ్. 1, కె.బి.ఎస్.హెచ్. 44 వంటి రకాలు.

**రమేష్, రాజ్రాం, విజయనగరం జిల్లా.**

**ప్ర. పుట్టగొడుగుల పెంపకంపై ఆన్‌లైన్‌లో శిక్షణకు ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలి. ?**

**జ.** ఆసక్తి గల వారు ఆంగ్రూ వెబ్‌సైట్‌లో నమోదు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి వివరాలు నింపి రూ. 1500/ - ఫీజుతో పాటు మా సార్వత్రిక మరియు దూర విద్యా కేంద్రం, లాం నకు పంపవలెను.

**వినయ్, పేరూరు, రామగిరి, అనంతపురం జిల్లా.**

**ప్ర. ఆముదం ఏ నేలల్లో పండించవచ్చో తెలియ జేయండి ?**

**జ.** అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. నీరు బాగా ఇంకే నేలలు అనుకూలం. చవుడు నేలల్లో మరియు నీరు నిలువ ఉండే నేలల్లో పండించరాదు.

**నరసింగరావు, చినగుమ్ములూరు, రాయవరం, అనకాపల్లి జిల్లా.**

**ప్ర. ఎర్రగరప నేలలో టేకు వేసి పది సంవత్సరాలు అయ్యింది. వర్షాధారమే, మొక్కలు లావు రావటం తేమ ఎరువుల యాజమాన్యం ?**

**జ.** శ్రీ కె. నరసింగరావు గారు మీరు వేసిన టేకు మొక్కలు లావు అవ్వాలంటే వర్షాలు పడినప్పుడు (ఎరువులు వేసినప్పుడు పొలంలో తడి అవసరం) ప్రతి మొక్క చుట్టూ పాదులా చేసుకొని 2 నుంచి 3 గంపలు పశువుల ఎరువు మరియు పిడికెడు డి.ఎ.పి. కలిపి ప్రతి మొక్క పాదులో వేసి మట్టిలో కలియబెట్టాలి. ఈవిధంగా ప్రతి వర్షాకాలంలో చేసుకోవాలి.

**మురళిధర్, తమిళనాడు.**

**ప్ర. కదిరి 1812 వేరుశనగ రకం లక్షణాలు తెలియజేయండి?**

**జ.** చిన్నగుత్తి రకం, ఆకుమచ్చ తెగుళ్ళను, వైరస్ తెగుళ్ళను, రసం పీల్చే పురుగులను, ఆకు తినే పచ్చ లద్దె పురుగులను తట్టుకుంటుంది. పంట కాలం 110-115 రోజులు. అధిక నూనె శాతం (51%), అధిక మాంసపు కృత్తులను కలిగి ఉంటుంది. తీవ్రమైన బెట్ట పరిస్థితులలో కూడా 600-800 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది. సాధారణ వర్షపాత పరిస్థితులలో ఎకరానికి 1400-1800 కిలోల కాయ దిగుబడిని ఇస్తుంది.

**గోపాల్, కృష్ణాపురం, అనంతపురం జిల్లా.**

**ప్ర. పొట్టి కొబ్బరి రకాలను తెలియజేయండి ?**

**జ. గౌతమి గంగ :** ఈ రకం గంగాబొండం అనే పొట్టి రకం నీటి బొండాలకు బాగా ఉపయోగపడును. నాటిన 4 సం॥ లో కాపుకు వచ్చును. సాలీన చెట్టు ఒక్కంటికి 85-94 కాయల దిగుబడి నిచ్చును.

**వశిష్ఠ గంగ :** వశిష్ఠ గంగ అనే పొట్టి రకం నాటిన 4 సంవత్సరములలో కాపుకు వచ్చును. సగటున చెట్టుకు, సంవత్సరమునకు 125 కాయల దిగుబడి నిచ్చును.

**అభయ గంగ :** ఈ రకము నాటిన 4 సంవత్సరములలో పూతకు వచ్చి, సగటున చెట్టుకి, సంవత్సరమునకు 136 కాయలు దిగుబడినిస్తుంది.

**రాజేష్, గొల్లచర్ల, మహబూబాద్, తెలంగాణ.**

**ప్ర. యం.టి.యు. 1262 వరి లక్షణాలు తెలియ జేయండి ?**

**జ.** మారుటేరు మషూరి (యం.టి.యు. 1262) పంట కాలం 155 రోజులు, దిగుబడి 2.6-2.8 ట./ఎకరానికి ఎండాకు తెగులు మరియు దోమపోటును తట్టు కుంటుంది. కాండం ధృడంగా ఉండి, చేనుపై పడిపోదు. గింజ రాలిక తక్కువ. ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది.

# మిరపలో అధిక ఆదాయం పొందిన శ్రీ. జి.పి. నాగిరెడ్డి విజయగాధ

డా॥ జి. ప్రసాద్ బాబు, శాస్త్రవేత్త (విస్తరణ శాస్త్రం); డా॥ ఎన్. రమేశ్ నాయక్, శాస్త్రవేత్త (కీటక శాస్త్రం);
డా॥ కె. లక్ష్మణ్, శాస్త్రవేత్త (సేద్య శాస్త్రం); డా॥ యం. మహాదేవయ్య, శాస్త్రవేత్త (మృత్తిక శాస్త్రం) మరియు
డా॥ టి. శ్రీనివాస్, కార్యక్రమ సమన్వయ కర్త, కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసి.







కర్నూలు జిల్లాలో మిరప పంటను దాదాపు 25,000 హెక్టార్లలో సాగు చేస్తారు. జూన్, జులై మాసాల్లో నారును పెంచుకొని ఆగస్టు మాసంలో ప్రధాన పొలంలో నాటుకోవడం జరుగుతుంది. (పంట కాలంలో) రైతులు సరాసరి ఎకరాకు 1.0 లక్ష నుండి 1.5 లక్షల రూపాయలు వివిధ ఉత్పాదకాలపై ఖర్చు పెట్టి సరాసరి 20 నుండి 25 క్వింటాళ్ళ దిగుబడి తీస్తుంటారు. గోనెగండ్ల మండలం, జగ్గాపురం గ్రామానికి చెందిన శ్రీ. జి.పి. నాగిరెడ్డి (ఫోన్ నెం: 96762 22095) అనే యువరైతు కూడా గత 3 సంవత్సరాలుగా మిరప సాగు చేస్తున్నప్పటికీ నూతన సాంకేతిక యాజమాన్య పద్ధతులపై అవగాహన లేకపోవడంతో నష్టాలను చవిచూసేవారు. అతను కృషి విజ్ఞాన కేంద్రం, బనవాసిని సంప్రదించి తన సమస్యను తెలియపరచడం జరిగింది. కె.వి.కె. శాస్త్రవేత్తలు అతను అవలంబిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంలో విస్తరణ అధ్యయనాల ద్వారా లోపాలైనటువంటి విత్తనశుద్ధి చేయకపోవడం, నారు కుళ్ళు, రసం పీల్చే పురుగుల సమస్యలు, వైరస్ తెగుళ్ళు, సిఫారసుకు మించి ఎరువులు, పురుగు మందుల వాడకం, సిఫారసు లేని బయో మందుల వాడకం, కాయకుళ్ళు తెగుళ్లు, రోగ నిర్ధారణపై అవగాహన లేకపోవడం వంటి సమస్యలను గమనించి సీజన్ ప్రారంభం నుండి చివరి వరకూ ఈ సమస్యలకు పరిష్కార మార్గాలను, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, సలహాలను, సూచనలను, క్షేత్ర సందర్శనల ద్వారా, వాట్సాప్ గ్రూపుల ద్వారా, శిక్షణా కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు అందివ్వడం జరిగింది. రైతు సంకర విత్తనాన్ని ఎంపిక చేసుకొని జులై 15 వ తేదీ నారు పెంచి ఆగస్ట్ మాసం చివరి వారంలో నారును ప్రధాన పొలంలో నాటుకోవడం జరిగింది. కె.వి.కె. అందించిన సాంకేతిక

సలహాలలో ముఖ్యమైనవి పచ్చిరొట్ట పైర్లను పెంచి నేలలో కలియదున్నడం, ట్రైకోడెర్మా, సూడోమోనాస్, బవేరియ బాసియానా, వర్టిసిలియం లకాని వంటి జీవ శిలీంధ్ర నాశినిలను వాడడం, విత్తనశుద్ధి చేయడం, నాణ్యమైన నారును పెంచడం, విత్తే విధానం, నారు శుద్ధి, లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు, రక్షక పంటలు, వేపనూనె పిచికారీ, నీటి యజమాన్యం, సమగ్ర ఎరువుల యజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించడం, సిఫారసు మేరకు ఎరువుల వినియోగం, సూచించిన మేరకు పురుగు, తెగుళ్ళ మందుల వాడకం మొదలైనవి పాటించడం జరిగింది. ట్రైకోడెర్మా, సూడోమోనాస్ వంటి జీవ శిలీంధ్ర నాశినులు వాడడం ద్వారా వడలు తెగులు (విల్ట్) బాగా తగ్గడం జరిగింది. అలాగే సమగ్ర సస్యరక్షణ చర్యల వల్ల కాయకుళ్ళు తెగులు మరియు నల్ల తామర పురుగులును సమర్థవంతంగా నివారించుకోవడం జరిగింది. సమగ్ర ఎరువుల యజమాన్యం వల్ల సుమారు 45% రసాయన ఎరువుల వాడకం తగ్గించడం జరిగింది. అలాగే పిచికారిల సంఖ్య 35 నుండి 12 కి తగ్గడం జరిగింది. దీని వల్ల పెట్టుబడి బాగా తగ్గించుకొని ఎకరాకు 28.8 క్వింటాళ్ళ దిగుబడిని సాధించి తద్వారా రూ. 1,37,912/- నికర ఆదాయాన్ని పొందడం జరిగింది.

**ఆదాయ వ్యయ వివరాలు : (ఎకరాకు)**

| వ.సం. | అంశం | ఖర్చులు (రూ.) |
|---|---|---|
| 1 | మిరప విత్తనం | 8,800/- |
| 2 | జీలుగ | 240/- |
| 3 | దున్నడం | 4,000/- |
| 4 | నాట్లు | 2,000/- |
| 5 | కలుపు నివారణ | 12,000/- |
| 6 | పురుగు మందులు | 20,000/- |
| 7 | ఎరువులు | 20,000/- |
| 8 | కోతలు | 38,000/- |
| 9 | గ్రేడింగ్ | 12,000/- |
| 10 | రవాణా | 13,048/- |
| 11 | ఇతర ఖర్చులు | 20,000/- |
| | **మొత్తం ఖర్చులు** | **1,50,088/-** |

**రాబడి (ఎకరాకు) :**

| | | |
|---|---|---|
| దిగుబడి | - | 28.8 క్వింటాళ్ళు |
| ధర | - | రూ. 10,000/- |
| **మొత్తం రాబడి** | - | **రూ. 2,88,000/-** |

**ఆదాయం (ఎకరాకు) :**

| | | |
|---|---|---|
| మొత్తం రాబడి | : | రూ. 2,88,000/- |
| మొత్తం ఖర్చులు | : | రూ. 1,50,088/- |
| **నికర ఆదాయం** | : | **రూ. 1,37,912/-** |


ఈ లాభాలతో తనకున్న అప్పులన్నీ తీర్చి మిగిలిన ఆదాయాన్ని కుటుంబ ఆరోగ్య అవసరాలకు, పిల్లల చదువులకు మరియు వ్యవసాయ యంత్రాల కొనుగోలుకు వినియోగించుకోవడం జరిగింది. అలాగే కె.వి.కె. సేవలతో సంతృప్తిని వ్యక్తం చేస్తూ ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర రైతులకు కూడా తెలియచేయడం జరిగింది.

మరింత సమాచారం కొరకు సంప్రదించాల్సిన
ఫోన్ నెం : **74163 84968**

## గమనిక : రైతు సేవలో టోల్ ఫ్రీ నెంబర్లు

| | | |
|---|---|---|
| ఫార్మర్స్ కాల్ సెంటర్ (ఆంగ్రూ) | : | 1800 425 0430 |
| ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ (డా॥ వై.ఎస్.ఆర్. రైతు భరోసా కేంద్రం) | : | 155251 |
| కిసాన్ కాల్ సెంటర్ | : | 1800 180 1551 |
| ఉద్యాన శాఖ | : | 1800 425 2960 |
| శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వ విద్యాలయం | : | 1800 120 4209 |
| కిసాన్ సారథి | : | 1800 123 2175 లేదా 14426 |
| మత్స్య శాఖ | : | 1800 425 1188 |
| వాతావరణ సూచనలు (భారత ప్రభుత్వం) | : | 1800 180 1717 |

వరిలో చీడపీడలు మరియు పోషక లోపాల నిర్ధారణ కరదీపిక




సంప్రదించవలసిన చిరునామా : ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి, లాం, గుంటూరు. సెల్ : **91005 00223**

RNI NO : APTEL/2012/46939

**JULY 2022**

Postal Regd. No. GTR/82/2022-24
Date of Publication : 07-07-2022
Date of Posting 09-07-2022

## ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం




ANGRAU

# ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము

**లాం, గుంటూరు - 522 034**

ముద్రణ & ప్రచురణ కర్త : ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి, ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయము, గుంటూరు.

ముద్రణాలయం : ప్రజాశక్తి ప్రింటర్స్ & పబ్లిషర్స్ ప్రై.లి., కృష్ణనగర్, తాడేపల్లి, గుంటూరు జిల్లా.